


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 23, పేజీలు - 08

శనివారం, జులై 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



# కల్లోల కాంగ్రెస్

## - ముదురుతున్న సమన్వయ లోపం - వరుసగా వివాదాలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో ప్రభుత్వ పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో గాంధీభవన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం వల్లే పార్టీలో ఈ అంతర్గత సంక్షోభం ముదురుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### యాదాద్రిబోర్డు నియామకంపై అసంతృప్తి

ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కాంగ్రెస్ అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డు నియామకంలో తమకు సరైన ప్రాధాన్యత దక్కలేదని, జూనియర్లకు పదవులు కట్టబెట్టారని పార్టీ కోసం ఎప్పటి నుంచో నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో తమకు తెలియకుండానే నియామకాలు జరగడంపై వారు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.

### గాంధీభవన్ లో తుంగతుర్తి పంచాయతీ రచ్చ

మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.

2లో..

పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం

# ఈసీకి లేదు

## - ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం సంచలన వ్యాఖ్యలు చేసింది. పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదని, ఓటర్ల జాబితాపై మాత్రం దానికి అథారిటీ ఉంటుందని స్పష్టం చేసింది. ఓటరు జాబితాలో పేరు లేనంత మాత్రం పౌరసత్వం పోదని తేల్చిచెప్పింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రత్యేక ట్రిబ్యునల్స్ వారి అప్పీళ్లను తిరస్కరించిన తర్వాత ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన వ్యక్తులకు ప్రభుత్వ పథకాల కింద లభించే సంక్షేమ ప్రయోజనాలను నిలిపివేయకూడదని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన్‌ల ధర్మాసనం కేంద్ర ఎన్నికల సంఘం, పశ్చిమ బెంగాల్

2లో..

# ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర కేబినెట్ అత్యంత కీలక సమావేశం నిర్వహించింది. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో భూ పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉపాధి, సంక్షేమ రంగాలకు సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రగతి గమనాన్ని మార్చే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు నుంచి పల్లెల్లో పాలనా సంస్కరణల వరకు పలు కీలక బిల్లులు, ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

### ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్

ఈ కేబినెట్ నిర్ణయాల్లో అన్నింటికంటే ప్రధానమైనది ధరణి పోర్టల్‌పై తీసుకున్న నిర్ణయం.

2లో..

తెలంగాణలో

# కొత్త పింఛన్లు

## - ఆగస్టు 15 నుంచి ప్రారంభం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు సహా కొత్త లబ్ధిదారులకు ఆగస్ట్ 15వ తేదీ నుంచి

2లో..

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులూ భాగస్వాములు కావాలి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి





**నరసరావుపేట (ప్రశ్న న్యూస్)** 'బ్యాంకులు ప్రజల దగ్గరకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని నరేంద్రమోడీ ఆలోచన అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వీధి వ్యాపారులకు కూడా ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు సహకరించాలని ఈ కార్యక్రమం చేపట్టాం అని చెప్పుకొచ్చారు. నరసరావుపేటలో రుణమేలా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక

2లో..

# ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

## - తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు - ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్

## - బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర కేబినెట్ అత్యంత కీలక సమావేశం నిర్వహించింది. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో భూ పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉపాధి, సంక్షేమ రంగాలకు సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రగతి గమనాన్ని మార్చే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు నుంచి పల్లెల్లో పాలనా సంస్కరణల వరకు పలు కీలక బిల్లులు, ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

### ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్

ఈ కేబినెట్ నిర్ణయాల్లో అన్నింటికంటే ప్రధానమైనది ధరణి పోర్టల్‌పై తీసుకున్న నిర్ణయం. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపణలతో, దీనిపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్‌కు కేబినెట్ ఆదేశించింది. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని లోతుగా పరిశీలించేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని

2లో..

# తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- న్యూ ఎంప్లాయిూస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం
- 886 ప్రైవేట్ ఆస్పత్రులలో క్యాష్‌లెస్ట్ ట్రీట్మెంట్
- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ తెలిపింది.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన, పారదర్శకమైన, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూ ఎంప్లాయిూస్ హెల్త్ స్కీమ్‌ను శుక్రవారం ప్రారంభించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

2లో..

# తొలి వన్యప్రాణుల ఎకో- బ్రిడ్జి

## - ఆసిఫాబాద్ అడవుల్లో రూ.17 కోట్లతో నిర్మాణం!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సాధారణంగా మనుషుల కోసమే బ్రిడ్జిలను ఏర్పాటు చేస్తారు. ఇదంతా అందరికీ తెలిసిన విషయమే కాగా ఇప్పుడు పెద్ద పులుల కోసమూ బ్రిడ్జిని ఏర్పాటు చేయబోతోంది తెలంగాణ సర్కారు. ముఖ్యంగా హైవేలపై మూగజీవాల రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, వాటి సహజ వలస మార్గాలకు ఆటంకం కలగకుండా చూడటానికి తెలంగాణ అటవీ శాఖ, జాతీయ రహదారుల సంస్థ సంయుక్తంగా ఏకో బ్రిడ్జి నిర్మాణానికి

2లో..

# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి

## - నిర్మలకు చంద్రబాబు వినతులు



**అమరావతి** ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన వినతులు సమర్పించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని, రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన హార్టికల్చర్ హబ్‌కు సహకరించాలని సీఎం కోరారు.

2లో..

పట్టాలెక్కిన తొలి

# హైడ్రోజన్ రైలు

## - జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత రైల్వే చరిత్రలో సరికొత్త విప్లవం మొదలైంది. హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత ప్యాసింజర్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ విజయంతో ప్రపంచంలోనే హైడ్రోజన్ రైళ్ల

2లో..

బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు

# హైకోర్టు అనుమతి

- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతమవ్వకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేడు హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో

3లో..

# కల్లోల కాంగ్రెస్

### చక్కదిద్దలేకపోతున్న రాష్ట్ర నాయకత్వం

ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్నా సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ సామర్థ్యం సరిపోవడం లేదంటూ సీనియర్లు భావిస్తున్నారు. సమస్యల తీవ్రతపై నివేదికలు సిద్ధం చేసి, రాష్ట్ర స్థాయిలోనే సెటిల్ చేయాల్సింది పోయి.. ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.

### పీసీసీ చీఫ్‌ను మారుస్తారా?

తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలను మార్చాలనే ప్రచారం ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

## పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఈసీకి లేదు

ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది. ఈ వ్యవహారంపై జులై 25లోపు విచారణ జాబితా చేసే అవకాశం ఉందని పేర్కొంది.

### పెండింగ్‌లో 34 లక్షల ఓట్లు

ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించినంత మాత్రాన, ప్రజా పంపిణీ వ్యవస్థ, అన్నపూర్ణ పథకం, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందించే ఇతర సంక్షేమ పథకాల నుంచి మినహాయించకూడదని వాదించారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రత్యేక ట్రిబ్యునళ్ల ముందు సుమారు 34 లక్షల అప్పీళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అయితే మీడియా నివేదికల ప్రకారం ఇప్పటివరకు కేవలం 38,000 అప్పీళ్లపై మాత్రమే తీర్పు వెలువడిందని తెలిపారు. అప్పీళ్లను విచారించేందుకు కేవలం 19 ట్రిబ్యునళ్లు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఇద్దరు న్యాయమూర్తులు ఇప్పటికే రాజీనామా చేశారని కూడా ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగింపు వల్ల కలిగే పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రభావితమైన వారు ప్రజా సంక్షేమ పథకాలు, హక్కులకు దూరమవుతున్నారని శంకరనారాయణన్ వాదించారు.

### బెంగాల్‌లో పథకాలు నిలిపివేత?

"ప్రస్తుతం ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించడం వల్ల ఎదురయ్యే పరిణామాలు రేషన్, అన్నపూర్ణ పథకం, కుల ధ్రువీకరణ పత్రాలు, వెరిఫికేషన్‌పై పడుతున్నాయి" అని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు, వారి పౌరసత్వ స్థితికి సంబంధించిన సమస్యలు తుది పరిష్కారం కాకముందే ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దీనికి జస్టిస్ జోయమాల్య బాగ్చీ స్పందిస్తూ బీహార్ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే ఈ అంశంపై స్పష్టతనిచ్చిందని తెలిపారు. "మాకు ఈ విషయంపై అవగాహన ఉంది, బిహార్ ఎస్ఐఆర్ తీర్పులో మేము ఒక విషయాన్ని స్పష్టం చేశాం, ఓటింగ్ హక్కులపై ఈసీఐ నిర్ణయం తీసుకున్నంత మాత్రాన అది పౌరసత్వాన్ని నిర్ధారించలేదని స్పష్టం చేశాం పౌరసత్వ చట్టం కింద ఈ విషయాన్ని తుది పరిష్కారం కోసం సంబంధిత మంత్రిత్వ శాఖకు నివేదించాల్సిన బాధ్యత కూడా ఈసీఐకి ఉంది" అని జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. చట్టపరంగా పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ, బాధితులు తక్షణ ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారని శంకరనారాయణన్ వాదించారు. "ఈ సంక్షేమ పథకాలన్నింటినీ వారి నుంచి తొలగిస్తారని మీరు (కోర్టు) గానీ, మేము గానీ ఊహించలేదు" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించడం వలన ఎదురయ్యే పరిణామాలు రేషన్, అన్నపూర్ణ పథకం, కుల ధృవీకరణ పత్రాలు మరియు వెరిఫికేషన్‌లపై పడుతున్నాయి," అని ఆయన కోర్టుకు సమర్పించారు. అంతేకాకుండా, వారి పౌరసత్వ స్థితికి సంబంధించిన సమస్యలు తుది పరిష్కారానికి నోచుకోకముందే ప్రజలు ఈ ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### బిహార్ తీర్పును ప్రస్తావించిన కోర్టు

దీనికి జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, బీహార్ 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే ఈ అంశంపై స్పష్టతనిచ్చిందని పేర్కొన్నారు. "మాకు ఈ విషయంపై అవగాహన ఉంది. మా బీహార్ ఎస్ఐఆర్ తీర్పులో మేము ఒక విషయాన్ని స్పష్టం చేశాము; ఓటింగ్ హక్కులపై ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయం తీసుకున్నంత మాత్రాన, అది పౌరసత్వాన్ని నిర్ధారించలేదని స్పష్టం చేశాం. పౌరసత్వ చట్టం కింద ఈ అంశాన్ని తుది పరిష్కారం కోసం సంబంధిత మంత్రిత్వ శాఖకు రిఫర్ చేయాల్సిన బాధ్యత కూడా ఈసీఐపై ఉంది," అని జస్టిస్ బాగ్చీ వ్యాఖ్యానించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఓటర్ల జాబితా నుంచి తొలగించడం వల్ల ఓటు హక్కులు శాశ్వతంగా రద్దు కావని పేర్కొంది. ఓటర్ల జాబితాపై మాత్రమే ఈసీకి నియంత్రణ, పర్యవేక్షణ అధికారం ఉందని పునరుద్ఘాటించింది.

## తొలి వన్యప్రాణుల ఎకో- బ్రిడ్జి

రంగం సిద్ధం చేసింది. జాతీయ రహదారి-61 విస్తరణ పనుల్లో భాగంగా కుమురం భీం ఆసిఫాబాద్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో రాష్ట్రంలోనే ప్రప్రథమంగా, రూ.17 కోట్ల వ్యయంతో ఈ బ్రిడ్జిని నిర్మించబోతున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

### హైవే పైభాగంలో దట్టమైన అడవి సృష్టి!

సాధారణంగా ఫ్లైఓవర్లపై వాహనాలు వెళ్తుంటాయి. కానీ ఈ వినూత్న ఎకో బ్రిడ్జిపై మాత్రం అడవి జంతువులు ప్రయాణిస్తాయి. ఆసిఫాబాద్ సమీపంలోని అటవీ మార్గంలో జాతీయ రహదారిని కొంత మేర అండర్‌పాస్‌లా తీసుకువెళ్లి దానిపై భాగంలో 150 మీటర్ల పొడవు, 38 మీటర్ల వెడల్పుతో ఈ భారీ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ వంతెన పైభాగంలో మట్టిని నింపి, గడ్డి, చిన్నచిన్న పొదలు, చెట్లను పెంచి పూర్తిగా సహజసిద్ధమైన అటవీ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనివల్ల కింద నుంచి వాహనాలు వెళ్తున్నప్పటికీ పైన ప్రయాణించే వన్యప్రాణులకు అక్కడ ఒక రహదారి ఉందనే విషయమే తెలియదు. తమ దారిలో తాము సహజంగా ఒక అటవీ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎలాంటి భయం లేకుండా సురక్షితంగా వెళ్లగల్గుతాయని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి వినయ్ కుమార్ వివరించారు. ఈ అటవీ కారిడార్ గుండానే మహారాష్ట్ర నుంచి పెద్దపులులు తరచూ తెలంగాణలోకి రాకపోకలు సాగిస్తుండటంతో ఈ బ్రిడ్జి వాటికి ఒక వరప్రసాదంగా మారనుంది.

### రైల్వే ఓవర్‌పాస్.. యానిమల్ అండర్‌పాస్‌లు కూడా!

ఈ బృహత్తర వన్యప్రాణుల రక్షణ ప్రాజెక్టు కేవలం రహదారి ఎకో బ్రిడ్జితోనే ఆగడం లేదు. అడవి గుండా వెళ్లే బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ వద్ద కూడా జంతువులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రూ. 25.88 కోట్ల వ్యయంతో 100 మీటర్ల పొడవు గల రైల్వే ఓవర్‌పాస్‌ను కూడా నిర్మిస్తున్నారు. దీంతో పాటు ప్రసిద్ధ కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని ఇదే జాతీయ రహదారిలో గల నిర్మల్ – ఖానాపూర్ అటవీ మార్గంలో జంతువుల కదలికల కోసం మూడు ప్రత్యేక యానిమల్ అండర్ పాస్‌లను కూడా నిర్మిస్తున్నారు. ఈ సమగ్ర రక్షిత చర్యల ద్వారా అడవిలోని జీవ వైవిధ్యాన్ని కాపాడుతూనే రవాణా సౌకర్యాలను మెరుగు పరచవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు

నడుపుతున్న కొన్ని ప్రత్యేక దేశాల జాబితాలో భారతదేశం చేరింది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందిన ఈ రైలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది జింద్ – సోనిపట్ మధ్య ఉన్న 89 కిలోమీటర్ల మార్గంలో ప్రయాణిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర హైడ్రోజన్ రైళ్లతో పోలిస్తే ఇది చాలా పొడవైనది. ఇందులో 10 కోచ్‌లు ఉన్నాయి, దాదాపు 2,600 మంది ప్రయాణికులు కూర్చోవచ్చు. ఈ రైలు గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో డిజైన్ చేశారు. ఈ రైలు డీజిల్, విద్యుత్ తీగలతో పనిలేకుండా తన సొంతంగా విద్యుత్‌ను తయారు చేసుకుంటుంది. ఇందులో అమర్చిన ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయల్ సెల్ ద్వారా హైడ్రోజన్, గాలిలోని ఆక్సిజన్ కలిసి విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల పొగ రాదు, కేవలం నీటి ఆవిరి, వేడి మాత్రమే బయటకు వస్తాయి. ఈ రైలు కోసం జింద్‌లో దేశంలోనే అతిపెద్ద రైల్వే హైడ్రోజన్ రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని నిర్మించారు. నీటి నుండి హైడ్రోజన్‌ను వేరు చేసి 500 బార్ ఒత్తిడితో నిల్వ చేస్తారు. ప్రయాణికుల భద్రత కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కఠినమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. రైలులో హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లు, ఆటోమేటిక్ షట్‌డౌన్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు. జర్మనీకి చెందిన సంస్థ దీనికి భద్రతా ధృవీకరణ ఇచ్చింది. బ్రేకింగ్ సిస్టమ్, రైడ్ స్టెబిలిటీ పరీక్షలు పూర్తయ్యాకే దీనికి అనుమతి లభించింది. వంద శాతం రైల్వే విద్యుద్దీకరణ దిశగా సాగుతున్న భారత్‌కు ఈ క్లీన్ ఎనర్జీ రైలు ఒక మైలురాయిగా నిలుస్తుంది.

## ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపణలతో, దీనిపై సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్‌కు కేబినెట్ ఆదేశించింది. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని లోతుగా పరిశీలించేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా భూ రికార్డుల అవకతవకలకు బాధ్యులైన వారిని గుర్తించి, బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేబినెట్ స్పష్టం చేసింది.

### బుల్లెట్ ట్రైన్ అలైన్ మెంట్‌లో మార్పులు

మౌలిక సదుపాయాల రంగంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో మార్పులకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్-ముంబై, హైదరాబాద్-బెంగళూరు రూట్లలో భూసేకరణ వ్యయాన్ని తగ్గించేందుకు, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా స్టేషన్ల స్థానాల్లో, అలైన్‌మెంట్‌లో కొన్ని సాంకేతిక మార్పులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది, వీటికి కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మార్పుల ద్వారా ప్రాజెక్టు వ్యయం తగ్గడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రైల్వే హబ్‌ను అభివృద్ధి చేసే అవకాశం లభిస్తుంది.

### పలు కీలక నిర్ణయాలు

పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి మరియు అర్హులకు కేటాయించడానికి కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా విద్యా రంగానికి ఊతమిస్తూ జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పలు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణలకు కేబినెట్ ఓకే చెప్పింది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ, సర్పంచుల అధికారాల పరిధిని మరింత సులభతరం చేసే విధంగా ఈ సవరణల ముసాయిదాను రూపొందించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని కేబినెట్ నిర్ణయించింది.

## తెలంగాణలో కొత్త పింఛన్లు

పింఛన్లు అందజేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటన సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబ ఆధారం లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని భావిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కొత్త పింఛన్ల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేదా అవకతవకలకు తావు లేకుండా పెన్షన్ల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల్లో ఎవరైనా మరణించి ఉంటే, వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. అలా మిగిలే నిధులను కొత్తగా అర్హత సాధించిన లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనర్హులు పింఛన్లు పొందకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 2 నుంచి 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టింది. లబ్ధిదారుల ధృవీకరణ కోసం లైవ్ అథెంటికేషన్ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత ఆగస్ట్ 15వ తేదీ నుంచి అర్హుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ కానుంది. దీంతో ఎన్నో నెలలుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఒంటరి మహిళలు, ఇతర అర్హులలో ఆనందం వ్యక్తం అవుతోంది.

## ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా భూ రికార్డుల అవకతవకలకు బాధ్యులైన వారిని గుర్తించి, బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేబినెట్ స్పష్టం చేసింది.

### బుల్లెట్ ట్రైన్ అలైన్ మెంట్‌లో మార్పులు

మౌలిక సదుపాయాల రంగంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో మార్పులకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా హైదరాబాద్-ముంబై, హైదరాబాద్-బెంగళూరు రూట్లలో భూసేకరణ వ్యయాన్ని తగ్గించేందుకు, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా స్టేషన్ల స్థానాల్లో, అలైన్‌మెంట్‌లో కొన్ని సాంకేతిక మార్పులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది, వీటికి కేబినెట్ ఆమోదం లభించింది. ఈ మార్పుల ద్వారా ప్రాజెక్టు వ్యయం తగ్గడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రైల్వే హబ్‌ను అభివృద్ధి చేసే అవకాశం లభిస్తుంది.

### పలు కీలక నిర్ణయాలు

పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పటాన్‌చెరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి మరియు అర్హులకు కేటాయించడానికి కేబినెట్ అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా విద్యా రంగానికి ఊతమిస్తూ జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పలు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణలకు కేబినెట్ ఓకే చెప్పింది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ, సర్పంచుల అధికారాల పరిధిని మరింత సులభతరం చేసే విధంగా ఈ సవరణల ముసాయిదాను రూపొందించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని కేబినెట్ నిర్ణయించింది.

## ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి

### ఆక్వా రంగంపై తక్షణమే దృష్టి సారించాలి

ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, తక్షణం కేంద్రం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం 20 శాతానికి పైగా పెరిగిందని వివరించారు. ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు పెరిగిందని గణాంకాలతో సహా వివరించారు. ఈ భారం టన్నుకు రూ.25 వేల వరకు పెరిగిందన్నారు. అదే సమయంలో, భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలపై అమెరికా 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ విధించిందని, యాంటీ డంపింగ్ డ్యూటీ వేసే ఆలోచనలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని, ఈ సుంకాల వల్ల రాష్ట్రంలోని 30 లక్షల మంది జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాతో సంప్రదింపులు జరపాలని, రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో 'ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ' ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### పొగాకు రైతులను ఆదుకోవాలి

జీఎస్టీలో పొగాకు ఉత్పత్తులను అత్యధిక పన్ను శ్లాబులో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీని కారణంగా తయారీదారులు కొనుగోళ్లు తగ్గించడంతో వేలం ప్రక్రియ నెమ్మదించిందన్నారు. ఈ ఏడాది 230 మిలియన్ కేజీల ఉత్పత్తికి గాను కేవలం 34 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారని, ఇది రైతులు, కార్మికులు, రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు.

### రాయలసీమ సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక

రాయలసీమను దేశంలోనే అగ్రగామి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్'కు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. ఈ ప్రణాళిక ద్వారా రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో ఏటా రూ.81 వేల కోట్ల స్థూల విలువ జోడింపు, 19.7 లక్షల ఉద్యోగాలు సృష్టించవచ్చని వివరించారు.

ఆగస్టు 6-7 తేదీల్లో ఈ ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని నిర్మలా సీతారామన్‌ను ఆహ్వానించారు. వ్యవసాయ రంగంలో ఆవిష్కరణలకు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఈ హార్టికల్చర్ హబ్ ప్రణాళికలో భాగంగా, రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. వ్యవసాయంలో ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, వాతావరణ సుస్థిరత వంటి అంశాలపై పరిశోధనలు ప్రోత్సహించేలా ఇది గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పనిచేస్తుందన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ ఏర్పాటుకు కేంద్రం తోడ్పాటు అందించాలని కోరారు. రాష్ట్ర తక్షణ అవసరాలతో పాటు, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర సహకారం కోరడమే లక్ష్యంగా ఈ భేటీ సాగింది.

## తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ట్రస్ట్ డీడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, డౌన్‌లోడ్ చేసుకునే డిజిటల్ హెల్త్ కార్డులను విడుదల చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులకు కార్డులను అందజేశారు.

### పారదర్శకంగా న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్

ప్రజల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజ నర్సింహ అన్నారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అమలు చేసిందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో ఉద్యోగులు, పెన్షనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరింత సమర్థవంతమైన, సుస్థిరమైన, పారదర్శకమైన న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ను రూపొందించామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

### 17,88,336 మంది లబ్ధిదారులకు ఆరోగ్య భద్రత

గతంలో అమలులో ఉన్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో ప్యాకేజీ రేట్లు తక్కువగా ఉండటంతో అనేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ భాగస్వామ్యం కావడం లేదని, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం, ఉద్యోగుల ప్రాతినిధ్యం లేకపోవడం, ప్యాకేజీల సవరణలో పరిమితులు వంటి సమస్యలు ఉన్నాయని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. 'వాటన్నింటికీ శాశ్వత పరిష్కారంగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మొత్తం 17,88,336 మంది లబ్ధిదారులకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. వీరిలో 4,38,594 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 3,61,955 మంది పెన్షనర్లు, సుమారు 9.88 లక్షల మంది కుటుంబ సభ్యులు ఉన్నారని చెప్పారు. ఈ స్కీమ్ అమలులో ఉద్యోగులు, పెన్షనర్ల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కంట్రిబ్యూట్ చేస్తుందని ప్రతి పైసాను ఈహెచ్ఎస్ అమలు కోసమే వినియోగిస్తాం'అని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

### 886 ప్రైవేట్ ఆస్పత్రులలో క్యాష్ లెస్ ట్రీట్మెంట్

రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్ హాస్పిటల్స్‌తో పాటు 114 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో క్యాష్‌లెస్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కామినేని, కాంటినెంటల్, కేర్, స్టార్, బసవతారకం వంటి ప్రముఖ కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కూడా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు అత్యాధునిక వైద్య సేవలు పొందే అవకాశం కల్పించామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ పథకంలో భాగస్వామ్యమైన అన్ని హాస్పిటళ్ల యాజమాన్యాలు, డాక్టర్లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ విధానానికి అనుగుణంగా 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకంలో అమలు చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల ఉద్యోగులకు నాణ్యమైన వైద్యం అందడంతో పాటు కార్పొరేట్ హాస్పిటల్స్ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

### డిజిటల్ విధానంలో ప్రీ-ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్

ఈహెచ్ఎస్ పథకాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ట్రస్ట్‌లో ప్రభుత్వం తరఫున 17 మంది, ఉద్యోగుల తరఫున 10 మంది, పెన్షనర్ల తరఫున ముగ్గురు సభ్యులు ఉండటం వల్ల ఉద్యోగుల భాగస్వామ్యంతో పారదర్శకంగా పథకం అమలవుతుందని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ డిజిటల్ హెల్త్ కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు మొత్తం ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో వెల్‌నెస్ సెంటర్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12 వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 1,800 మందికి ఔట్‌పేషెంట్ సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి కేంద్రంలో ఎంబీబీఎస్, స్పెషలిస్ట్ డాక్టర్లు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ల్యాబ్ పరీక్షలు, బ్రాండెడ్ మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం వెల్‌నెస్ సెంటర్లు లేని 24 జిల్లాల్లో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఈ సేవలను మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్‌తో అనుసంధానిస్తామని, అక్కడ పనిచేసే స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్ వైద్యుల సేవలను వెల్‌నెస్ సెంటర్లలో అందుబాటులో తీసుకొస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సభ్యులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పెన్షనర్ల సంఘాల నాయకులు, నెట్‌వర్క్ హాస్పిటల్స్ ప్రతినిధులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులూ భాగస్వాములు కావాలి

మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రసంగం చేశారు. 'ఎలాంటి హామీ లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తే వ్యాపారులకు, మహిళలకు ప్రయోజనం అందుతుంది. మైక్రో ఫైనాన్స్ కోసం వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకోవటం అధిక వడ్డీలు చెల్లించటం సరికాదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది'అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

### అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్నదే మా లక్ష్యం

'2004 నుంచి 2014 వరకూ ఉన్న కేంద్ర ప్రభుత్వం ఫోన్ బ్యాంకింగ్ ద్వారా అప్పులు ఎవరికి ఇవ్వాలో నిర్దేశించేది. కానీ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారాయి'అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 'గ్రామ గ్రామాలకూ బ్యాంకులు వెళ్లి లబ్దిదారులకు ఎలాంటి హామీ లేకుండా రుణాలు ఇస్తున్నాయి. అర్హత ఉంటే చాలు రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ అప్రోచ్‌ను మార్చుకున్నాయి. ప్రజలు కూడా తమ భావన మార్చుకున్నారు. నరసరావుపేటలో నిర్వహించిన ఈ క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ'అని కేంద్రఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 'కోట్ల రూపాయల రుణాన్ని వ్యాపారులుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకులు ఇచ్చాయి. 2047 నాటికి భారత దేశం వికసిత్ దేశంగా మారాలి. అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్నదే మా లక్ష్యం'అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

### ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం: సీఎం చంద్రబాబు

'సంక్షేమమైనా, అభివృద్ధి కార్యక్రమం అయినా ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్.హెచ్.జీలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, వీధి వ్యాపారులు ఇలా వివిధ వర్గాలకు రుణం అందించటం అభినందనీయం'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'గతంలో బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోవాల్సి వచ్చేది ఇప్పుడు బ్యాంకులే మన దగ్గరకు వచ్చి రుణాలు ఇస్తున్నాయి. వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.325 కోట్లు, గృహ, విద్య, వాహన, సౌరవిద్యుత్ కు రూ.624 కోట్లు రుణాలు అందాయి. బ్యాంకులు ఇచ్చే రుణాలు ఒక రైతు భవిష్యత్తును, యువత ఆశయానికి, ఓ మహిళ సాధికారితకు, ఓ పారిశ్రామికవేత్త కలల పెట్టుబడిగా నిలుస్తాయి'అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.

### వీబీజీ రామ్ జీ కింద ఏపీకి రూ.7,707 కోట్లు

'వడ్డీ వ్యాపారుల నుంచి అధికవడ్డీకి అప్పులు తెచ్చి నష్టపోకుండా బ్యాంకులు ఈ రుణమేళా ద్వారా రుణాలు ఇవ్వటం అభినందనీయం. ఎన్.పీ.ఏలపై కఠినంగా వ్యవహరించి దేశంలో డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం తీసుకువచ్చిన వ్యక్తి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్'అని సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. 'జీఎస్టీ స్లాబ్ లను మార్చి పన్ను భారం తగ్గించటం వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగింది. గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రం నిలబెట్టింది. అమరావతి, పోలవరానికి, విశాఖ స్టీల్ ప్లాంట్ కు ఆర్థిక సహకారం అందించింది. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్

'రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేలకోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది. ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మారుస్తాం. గత పాలనలో అధిక వడ్డీలకు చేసిన అప్పులను రీ షెడ్యూలు చేశాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'రాష్ట్రంలోని రుణాలను రీ షెడ్యూలు చేసేందుకు కేంద్రం సహకారం అందిస్తోంది. దీని వల్ల రూ.1538 కోట్లు ఆదా అయ్యింది. మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు'అని కొనియాడారు. '10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్లతో పొదుపులో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతం చెల్లింపులోనూ డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. 2047 నాటికి హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేందుకు మేం ప్రయత్నిస్తున్నాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి

యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు.కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## వర్షం కోసం మూడవ రోజు
## ముస్లిం సోదరులు ప్రత్యేక ఫాతెహాలు

**కౌతాళం** మానవాళికి అత్యంత సన్నిహితమైన ఆహారం ఏదైనా ఉంది అంటే అది మంచినీళ్లు అని ఆఫీస్ సబ్ తెలిపారు. ముస్లిమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం మూడవ రోజున వర్షం కోసం ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు. వారు మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావముల వర్షపాతం అతి తక్కువగా ఉండటంతో వేసిన పంటలు ఎందు ముఖం పెట్టడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కళ్ళముందే ఆవిరివుతుంటే. అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మానవ మనుగడకు ఒక పూట అన్నం లేక పోయిన పర్వాలేదు మంచినీళ్లు ప్రతి అరగంటకు అందరికీ కావలసిందేనని మానవ సృష్టిలో చెట్టు. చీమ మూగజీవగలకు. సైతం నీరు ఎంతో అవసరమని తెలిపారు. సకాలంలో వర్షాలు బాగాపడి రైతుల ముఖాల్లో ఆనందం విల్లు విరియాలని వారు పెట్టిన పెట్టుబడులు అధికంగా లాభాలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియా మసిద్, నురాని,మసిద్,మదీనా మసీద్ ముస్లిం సోదరులు ఎక్కువ సంఖ్యలు ప్రత్యేక ఫాతిహాలు ప్రార్థనలు జరిపారు.

## పంటల బీమా రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారులు శేషాద్రి**

**కౌతాళం** మండలంలోని రైతులందరికీ శుభవార్త ఈనెల 15వ తేదీ నా పంటల బీమాకు తుది గడువు పత్తి పంటకు వేరుశనగ పంటకు ఉండేది, మన జిల్లా కలెక్టర్ గారి చరవతో మన కర్నూలు జిల్లాకు వాతావరణ ఆధారిత పంటల బీమా పత్తి పంట మరియు వేరుశనగ పంటకు నాన్ లోని ఫార్మర్స్ బీమా చేసుకొనుటకు గాను ఈ నెల చివరి తేదీ 31వ తేదీ వరకు గడువు పొడిగించడం అయినది, ఇదివరకే లోని ఫార్మర్స్ కు బ్యాంకులో లోను తీసుకున్న వాళ్లకు కూడా 31వ తేదీ వరకు ప్రీమియం చెల్లించుటకు అవకాశం కల్పించి ఉన్నారు. అంతేకాకుండా అన్ని పంటలో కూడా ఈనెల 31వ తేదీ వరకు ఖీచిఃఅమొ ఒఖఓఈఃజ అన్ని మీసేవ, సిఎస్సి సెంటర్లు నందు ప్రీమియం చెల్లించి పంటల బీమా చేసుకోగలరు. కావున కౌతాళం మండలంలోని రైతులు అందరు కూడా ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటల భీమా తప్పనిసరి చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి కోరారు.

## మోస్ట్ వాంటెడ్ జాబితాలోని భారతీయుడు నితీశ్ కౌశల్ అరెస్ట్

**ఛండీఘడ్,** ఎఫ్‌బీఐ భారీ దెబ్బకొట్టింది. పంజాబ్ కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్‌స్టర్ జగ్గూ భగవాన్‌పురియాకు చెందిన అంతర్జాతీయ ముఠాలో కీలక సభ్యుడైన నితీశ్ కౌశల్‌ను యూఎస్‌లోని వర్మోంట్‌లో అరెస్ట్ చేసింది. కొద్ది రోజుల క్రితమే ఎఫ్‌బీఐ తన 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో నితీశ్‌ను చేర్చగా, తాజాగా అతడిని అదుపులోకి తీసుకున్నట్టు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ ముఠాకు సంబంధించిన ఇతర పరారీలో ఉన్న నేరగాళ్ల సమాచారం కోసం ప్రజల సహాయాన్ని కూడా ఎఫ్‌బీఐ కోరింది.జగ్గూ భగవాన్‌పురియా ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్ అనేది భారత్‌లోని పంజాబ్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక అంతర్జాతీయ వ్యవస్థీకృత నేర ముఠా. అమెరికా, కెనడా, యూకే, యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో దీని నెట్‌వర్క్ విస్తరించి ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ ముఠాకు 1,000 మందికి పైగా సభ్యులు, అనుచరులు ఉండగా, ఒక్క అమెరికాలోనే 100 మందికి పైగా ఉన్నారని ప్రాసిక్యూటర్లు ఆరోపిస్తున్నారు. హత్యలు, కిడ్నాపులు, డ్రగ్స్ రవాణా, బలవంతపు వసూళ్లు, ఆయుధాల అక్రమ రవాణా, మనీ లాండరింగ్, మానవ అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాల ద్వారా ఈ ముఠా ఆదాయం సంపాదిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. కాలిఫోర్నియా జిల్లా కోర్టు జూన్ 25న నితీశ్ కౌశల్‌పై ఫెడరల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అతడిపై కఠినమైన 'రికో' చట్టం కింద అభియోగాలు మోపారు.ఈ ముఠాలో 'లాలా' అనే మారుపేరుతో పిలువబడే నితీశ్ కౌశల్ కీలక పాత్ర పోషించినట్టు ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. ముఠా తరఫున కిడ్నాపులు, దాడులు వంటి హింసాత్మక చర్యలకు పాల్పడేవాడని అభియోగపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా 2024 జులై 10న జరిగిన ఒక కిడ్నాప్ ఘటనలో నితీశ్ ప్రధాన పాత్రధారి అని ప్రాసిక్యూటర్లు తెలిపారు. ముఠాకు చెందిన డ్రగ్స్ షిప్‌మెంట్‌ను ఒక వ్యక్తి దొంగిలించాడని భావించి, అతడిని కాలిఫోర్నియాలోని మాంటెకాలో ఒక ఇంటికి రప్పించారు. అక్కడ నితీశ్‌తో పాటు మరో ముగ్గురు కలిసి బాధితుడిని బంధించి, తీవ్రంగా కొట్టి ఫ్రెస్నోలోని ఒక అపార్ట్‌మెంట్‌కు తరలించారు. దొంగిలించబడిన డ్రగ్స్‌కు నష్టపరిహారంగా 50,000 డాలర్లు డిమాండ్ చేశారు. అయితే, ముఠాలోని అంతర్గత వివాదాన్ని పరిష్కరించుకునేందుకు జగ్గూ భగవాన్‌పురియా ఆదేశాలతో బాధితుడిని తర్వాత విడిచిపెట్టారని ఆరోపణలు ఉన్నాయిఈ ముఠా ప్రధానంగా డ్రగ్స్ రవాణాపై ఆధారపడి పనిచేస్తుంది. దక్షిణ కాలిఫోర్నియాలో కొకైన్, మెథామ్‌ఫెటమైన్ వంటి డ్రగ్స్‌ను సేకరించి, భారీ సెమీ-ట్రక్కుల ద్వారా అమెరికా తూర్పు తీరానికి, కెనడా సరిహద్దుకు తరలించేవారు. ఒక్కో షిప్‌మెంట్‌లో 100 కిలోల వరకు డ్రగ్స్ ఉండేవని ప్రాసిక్యూటర్లు తెలిపారు. సుపారీ హత్యలు, ప్రత్యర్థి ముఠాల నుంచి డ్రగ్స్ దొంగిలించడం, బలవంతపు వసూళ్లు వంటివి కూడా వీరి కార్యకలాపాల్లో భాగమే. బాధితుల కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భారత్‌లో నివసించే వారి వివరాలు సేకరించి, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. పంజాబ్‌లోని కొందరు అవినీతి పోలీసు అధికారులతో కలిసి ప్రత్యర్థులపై తప్పుడు కేసులు బనాయించి, వాటిని ఉపసంహరించుకోవడానికి డబ్బు డిమాండ్ చేసేవారని కూడా అభియోగపత్రంలో ఉంది. పంజాబ్‌లోని యువతకు డబ్బు, అధికారం, విదేశీ అవకాశాలు ఆశ చూపి ముఠాలోకి చేర్చుకునేవారు.నితీశ్ కౌశల్ అరెస్ట్‌తో ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై దర్యాప్తులో కీలక ముందడుగు పడినట్టయింది. అయితే, ఈ ఆరోపణలు ఇంకా న్యాయస్థానంలో రుజువు కావాల్సి ఉంది. విచారణ పూర్తయ్యేవరకు నిందితులను నిర్దోషులుగానే పరిగణించాల్సి ఉంటుంది.

## అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం .. ఇద్దరు మృతి




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** గత అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు స్కూటీపై వెళ్తున్న సోహెల్ (18), సుమిత్ ( 19) లను కండ్లకోయ ఓ ఆర్ ఆర్ బ్రిడ్జి కింద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.
పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కోట్ల పనులు... నాణ్యత గాలికి.?

**క్యూరింగ్ లేకుండానే బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తున్న కాంట్రాక్టర్**

**మౌలాలి సర్కిల్‌లో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణపై తీవ్ర అనుమానాలు**

**ఏఈ, డీఈ, ఈఈలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారా.? లేక కాగితాలకే పరిమితమా.?**

**ప్రజాధనంతో నిర్మిస్తున్న పనుల్లో నాణ్యత కనుమరుగైతే బాధ్యత ఎవరిది.?**






మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మౌలాలి సర్కిల్ పరిధిలో ఆర్టీసీ కాలనీ రహదారిపై కోట్లాది రూపాయలతో చేపడుతున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే కాంక్రీట్‌కు తప్పనిసరిగా నిర్వహించాల్సిన క్యూరింగ్‌ను చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల భవిష్యత్తులో నిర్మాణం బలహీనపడి పగుళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పనులు జరుగుతున్న సమయంలో ఇంజనీరింగ్ అధికారులు తరచూ తనిఖీలు చేయాల్సి ఉండగా ఏఈ, డిఈ, ఈ ఈ ల పర్యవేక్షణ అసలు కనిపించడం లేదని అందుకోసమే నీటి క్యూరింగ్ చేయకున్నా పట్టించుకున్న నాథుడే లేడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.మౌలాలి సర్కిల్ పరిధిలోని ఈ పనులను ఏఈ, డీఈ, ఈఈలు క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా.? లేక కాంట్రాక్టర్ చెప్పిందే నమ్మి కార్యాలయాల్లోనే ఫైళ్లకు సంతకాలు చేస్తున్నారా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై నాణ్యత లోపాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.నిర్మాణ పనుల్లో క్యూరింగ్ లేకపోతే కాంక్రీట్ బలం తగ్గే అవకాశం ఉందని అయిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు బిల్లులు ఎలా ఇస్తున్నారని వాళ్ళ లంచాల వాటా ఎంతో చెప్పాలని ప్రజలు పేర్కొంటున్నారు. క్యూరింగ్ లేకుంటే త్వరలో కూలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాధనంతో చేపడుతున్న ప్రతి పని నాణ్యతతో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులపై ఉంది. అయితే క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నాసిరకంగా మారితే దాని భారం చివరికి ప్రజలపైనే పడుతుంది. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు మౌలాలి సర్కిల్‌లో జరుగుతున్న బాక్స్ డ్రైనేజీ పనులపై సాంకేతిక విచారణ జరిపించి, క్యూరింగ్ సహా నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశాన్ని పరిశీలించి, నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ ద్రౌపతి దేవి సమేత శ్రీ ధర్మరాజ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభం





శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ ద్రౌపతి దేవి సమేత ధర్మరాజ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణ మహోత్సవంతో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె. వెంకటేశులు, డీఈఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దేవస్థానం బోర్డు సభ్యులు గురప్ప శెట్టి, గోపీనాథ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్,ప్రత్యేక ఆహ్వానితులు శైలజ ,దేవస్థానం అధికారులు, టిడిపి నాయకులు ,అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# బద్వేలు రూరల్ నియోజకవర్గంగా పోరుమామిళ్ల

**- వచ్చే ఎన్నికల నాటికి బద్వేలు అసెంబ్లీ జనరల్ కానుందా ?**

**- గత 25 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వ్ ఉన్న బద్వేలు**

**- పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు**

**బద్వేలు** ఇప్పటివరకు ఏడు మండలాలతో కలిసి ఉన్న బద్వేలు నియోజవర్గం పునర్ విభజన తో ప్రత్యేకంగా బద్వేలు రూరల్ పేరుతో పోరుమామిళ్ల కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి బద్వేల్ నియోజకవర్గం లో బద్వేలు పోరుమామిళ్ల కలసపాడు అట్లూరు బి కోడూరు కాశినాయన గోపవరం మండలాలు ఉన్నాయి ఇప్పుడు పోరుమామిళ్ల కేంద్రంగా బద్వేల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం రాజకీయ విశ్లేషకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఉమ్మడి కడప జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ నియోజకవర్గాలు కడప రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి ఇప్పుడు అసెంబ్లీ స్థానాల సంఖ్య 15 కు పెరగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు అందులో పోరుమామిళ్ల ఎర్రగుంట్ల లక్కిరెడ్డిపల్లె కడప గ్రామీణ నియోజకవర్గంతో పాటు మరో నియోజకవర్గం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది బద్వేలు రూరల్ నియోజకవర్గ పోరుమామిళ్ల కేంద్రంగా ఏర్పాటు అయ్యే పోరుమామిళ్ల మండలం బి కోడూరు కాశి నాయన కలసపాడు మండలాలతోపాటు మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠం మండలం కూడా కలిసే అవకాశం ఉంది ఇక బద్వేలు నియోజకవర్గం లో బద్వేలు గోపవరం అట్లూరు మండలాలు ఉండనున్నాయి నియోజకవర్గ విభజనపై ఆశావాహులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు గత 25 సంవత్సరాలుగా బద్వేల్ అసెంబ్లీ రిజర్వు స్థానంగా ఉంది విభజన జరిగితే బద్వేల్ అసెంబ్లీ జనరల్ అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు పార్లమెంట్ కేంద్రంగా ప్రొద్దుటూరు పార్లమెంటు అసెంబ్లీ స్థానాలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కడప జిల్లాలోని రాజకీయ ఉత్సాహవంతుల్లో ఎక్కడలేని విధంగా పరుగులు పెట్టిస్తుంది ప్రస్తుతం కడప జిల్లాలో పులివెందుల జమ్మలమడుగు బద్వేలు కడప ప్రొద్దుటూరు మైదుకూరు కమలాపురం ఉన్నాయి తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు పెంపు దమాషా ప్రకారం చూస్తే రెండు నుంచి మూడు అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది తాజా నిర్ణయం ప్రకారం ఎర్రగుంట్ల కడప గ్రామీణ పోరుమామిళ్ల కొత్త నియోజకవర్గాలు రానున్నాయి 1.50 లక్షలు ఓట్లు ఉండేలా కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది దీంతో కడప కడప గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అవకాశాలు ఉన్నాయి అవసరమైతే సిద్ధవటం మండలాన్ని కడప గ్రామీణ నియోజకవర్గంలో కలిపే అవకాశం ఉంది ప్రతిపాదిత, ఎర్రగుంట్ల నియోజకవర్గం కింద ఎర్రగుంట్ల ముదునూరు వీరుపు నాయుడు పల్లె తొండూరు కొండాపురం సింహాద్రిపురం మండలాలను చేర్చే అవకాశం ఉంది మూడోది ఏర్పాటు చేస్తే బద్వేలు మైదుకూరు పొద్దుటూరు నుంచి అవకాశం ఉంది

పోరుమామిళ్ల పొద్దుటూరు గ్రామీణ నియోజకవర్గాలు ఏర్పాటు అయ్యే అవకాశాలు లేకపోలేదు రాష్ట్రంలో పెరిగే పార్లమెంట్ స్థానాలను పరిగణలోకి తీసుకుంటే కడప జిల్లా నుంచి ఒక నియోజకవర్గానికి అవకాశం ఉంది పట్టణ ప్రాథమిక జనాభా ఓట్ల సంఖ్యను బట్టి ప్రొద్దుటూరు పార్లమెంటు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి ఇప్పటికే జిల్లాలో కడప కింద కడప రాజంపేట ప్రతిపాదిత కడప గ్రామీణ కమలాపురం బద్వేలు నియోజకవర్గాలు వచ్చే వీలు ఉంది ప్రొద్దుటూరు పార్లమెంట్ పరిధిలోకి పులివెందుల ప్రతిపాదిత ఎర్రగుంట్ల మైదుకూరు జమ్మలమడుగు పొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చే అవకాశం ఉంది విభజన జరిగితే పెరిగే స్థానాల్లో తమ అదృష్టం ఎలా ఉందో చూసుకోవచ్చు అనిప్రధాన పార్టీలకు చెందిన వారు ఎంతో ఆశపడుతున్నారు

## రాష్ట్రం కోసం ఏమి అడిగినా నిర్మల ఇస్తున్నారన్న పయ్యావుల

**గుంటూరు,** ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఒకే రోజున రూ.3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అందించిందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏ పని చేయాలన్నా ఖజానాలో డబ్బు లేని పరిస్థితి ఉండేదని అన్నారు.ప్రధాని మోదీ ఆశీస్సులు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆలోచనలతో ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. ఒక మహిళ ఇంటిని ఎలా తీర్చిదిద్దుతుందో అంతకంటే మెరుగ్గా నిర్మలా సీతారామన్ పనిచేస్తున్నారని మంత్రి కొనియాడారు. '2024లో మీరు వేసిన ఒక్క ఓటు వల్లే ఏపీకి అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఉచిత బస్సు, గూగుల్ వంటి కంపెనీల రాక సాధ్యమైంది' అని చెప్పుకొచ్చారు. ఏపీకి ఏ కష్టం వచ్చినా నిర్మలా సీతారామన్ ఇంటి తలుపు తట్టి సాయం అడుగుతున్నామని, రాష్ట్రం కోసం ఏం అడిగినా కాదనకుండా కేంద్ర మంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నిర్మలమ్మ చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వం రేయింబవళ్లూ రాష్ట్రం కోసం పనిచేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మహిళలు, యువతకు భారీగా రుణాలు అందిస్తున్నామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అటవీ సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా రుణాలు అందిస్తున్నామని చెప్పారు.

## తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

**హైదరాబాద్,** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు.శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు.

వారికి పార్టీలు తరపున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.

# మేడ్చల్ ట్రాఫిక్ సిఐగా

# క్రాంతి కుమార్ బాధ్యతల స్వీకరణ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ ట్రాఫిక్ సిఐ గా క్రాంతికుమార్ బాధ్యతలను చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పని చేస్తాను మధుసూదన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన క్రాంతి కుమార్ బాధ్యతలను చేపట్టగా అంబేద్కర్ ఆటో ఐఎన్టియుసి యూనియన్ నాయకులు కొత్తగా వచ్చిన ట్రాఫిక్ సిఐ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న సిఐ మధుసూదన్ తో పాటు ఆటో యూనియన్ ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు ఎర్ర విజయ రావ్, వైస్ ప్రెసిడెంట్ హోం రాజ్, కార్యదర్శి సత్యనారాయణ సురేష్, ముంతాజ్ పాల్గొన్నారు

## యువ సమగ్ర సదస్సును విజయవంతం చేయాలి

### బి ఆర్ ఎస్ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నేడు జరుగు యువ సంగ్రామ సదస్సుకు యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి కోరారు. యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగ భృతి ప్రత్యేక భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఉద్యోగ క్యాలెండర్ కాళీ పోస్టుల భర్తీ ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాల కల్పన నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు స్టార్టప్‌లకు ప్రోత్సాహం పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలంటే బిఆర్ఎస్ పార్టీ నిర్వహించే యువ సంగ్రామ సదస్సుకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని మద్దుల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే రెండున్నర సంవత్సరంలో అన్ని రంగాలలో విఫలమైందని, సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కు బుద్ధి చెప్పాల్సిన సమయం వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై విసిగి వేసారిన యువత రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బి ఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందించేందుకు సిద్ధంగా ఉన్నారని, గుండ్ల పోచంపల్లి డివిజన్ లో బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని మరోసారి పేర్కొన్నారు.

## పెన్షన్ ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదు, ఉద్యోగుల హక్కు

### రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) "పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదు.. అది ఉద్యోగుల హక్కు" అంటూ 1982 డిసెంబర్ 17న సుప్రీంకోర్టు 'డి.ఎస్. నకారా' కేసులో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును గుర్తు చేస్తూ తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ బకాయిల సాధనకై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024 మార్చి నుండి ఇప్పటివరకు పదవీ విరమణ పొందిన సుమారు 26,000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు హక్కుగా దక్కాల్సిన రిటైర్మెంట్ బకాయిలను రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పూర్తిగా చెల్లించడం లేదు. బకాయిల చెల్లింపు కోసం కొందరు ఉద్యోగులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రారంభంలో కొన్ని చెల్లింపులు చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత వాటిని నిలిపివేసింది. దీంతో కోర్టు ధిక్కరణ కేసులు కూడా నమోదయ్యాయి. రిటైర్మెంట్ బకాయిలను 10% వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ... ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే పూర్తి స్థాయిలో చెల్లించి, మరికొందరికి పాక్షికంగా బిల్లులు విడుదల చేసింది. అయినప్పటికీ పూర్తిగా చెల్లించామంటూ కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### అప్పుల ఊబిలో ఉద్యోగులు

ఉద్యోగంలో ఉన్న సమయంలో హోమ్ లోన్లు, పర్సనల్ లోన్లు, ప్రైవేటు అప్పులు తీసుకున్న వారు రిటైర్మెంట్ బకాయిలు అందక భారీగా వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున హైకోర్టు ఆదేశాల ప్రకారం రిటైర్డ్ ఉద్యోగులందరికీ 10 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### హామీలు ఒకటి .. వాస్తవాలు మరొకటి

వివిధ పెన్షనర్ సంఘాలు గత ఎనిమిది నెలలుగా చేస్తున్న ఉద్యమాల ఫలితంగా.. వంద రోజుల్లో 6,000 కోట్లు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా: మే నెలలో రూ.2,000 కోట్లు, జూన్ నెలలో రూ.2,000 కోట్లు చెల్లిస్తామని చెప్పింది. సెప్టెంబర్ 2025 నాటికి కమ్యుటేషన్, జీపీఎఫ్ ( జిపిఎఫ్) 100 శాతం చెల్లించామని ప్రభుత్వం ప్రకటించుకుంది. అయితే, వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. సెప్టెంబర్ 2025 నాటికి ఎస్టీఓ ( ఎస్ టి ఓ ) లో కమ్యుటేషన్ బిల్లులు సబ్మిట్ చేసినప్పటికీ ఇంకా చాలామందికి ఆ డబ్బు అందలేదు. కొందరికి జీపీఎఫ్ నిధులు కూడా రాలేదు. చివరికి పిల్లల పెళ్లి కార్డులు పెట్టి దరఖాస్తు చేసుకున్నప్పటికీ జీపీఎఫ్ డబ్బులు అందకపోవడం దారుణమని వాపోతున్నారు.

### తక్షణ డిమాండ్లు

తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగుల టోకెన్ నంబర్లను పరిశీలించి, ఈ జూలై నెలలోనే వారికి వెంటనే చెల్లింపులు జరపాలి. రిటైర్ అయిన ఉద్యోగులందరికీ రిటైర్మెంట్ బకాయిలను విడతలవారీగా కాకుండా, ఏకమొత్తంగా ఈ జూలై నెలలోనే చెల్లించి ఆదుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

# రాజకీయ నాయకుల అండతో రెచ్చిపోతున్న నిందితులు

**ఫిర్యాదు చేసిన చోద్యం చూస్తున్న పోలీసులు**

**రౌడీ మూకలతో దేవేందర్ నగర్‌లో శాంతి భద్రతలకు విఘాతం**

**దేవేందర్ నగర్ కాలనీలో గొడవలు, దాడులు నిత్య కృత్యం**

**కమిషనర్ స్పందించి దేవేందర్ నగర్ లో నిగాపించాలని విజ్ఞప్తి**

**పోలీస్ స్టేషన్లోఫిర్యాదు చేస్తే నేరస్తులపై చర్యలు శూన్యం**

**పోలీసుల బాధ్యతారహిత్యం పై రాపోలు రాములు ఫైర్**



బోడుప్పల్(ప్రశ్న న్యూస్) శాంతి భద్రతలకు విఘాతం కలిగిన మేడిపల్లి పోలీసులు కఠిన చర్యలు తీసుకోకుండా తూ తూ మంత్రంగా వ్యవహరించడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు రక్షణగా ఉండవలసిన పోలీసులు రాజకీయ నాయకుల అండదండతో ప్రజల రక్షణకు కరువవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందా.? అన్నదానిపై ఉన్నత అధికారులు కమిషనర్ ఒక్కసారి వాస్తవాలను పరిశీలిస్తే బాగుంటుందని రాపోలు రాములు పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో దేవేందర్ నగర్ కాలనీలో గత కొద్ది రోజుల క్రితం గృహప్రవేశం జరుగుతున్న ఇంటిపై కొందరు రౌడీ మూకలు దాడి చేసి,తన వృత్తిలో భాగంగా వీడియో చిత్రీకరిస్తున్న స్థానిక రిపోర్టర్ పైన దాడి చేయడం,అతని కారు ధ్వంసం చేసిన సంఘటన జరిగింది. సదరు జర్నలిస్టు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం, కొందరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. అదేవిధంగా దేవేందర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా జరుగుతున్న దాడులను అక్కడ నెలకొన్న పరిస్థితులతో బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుండి దేవేందర్ నగర్ కాలనీలో గొడవలు,భూ కబ్జాలు పెరిగాయని,రాజకీయ నాయకుల అండదండలతో,వారి కను సన్నల్లోనే రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయని రాపోలు రాములు అన్నారు. కొందరు నాయకులు పెంచి పోషించిన వ్యక్తులు ఈ సంఘటనలకు కారకులయ్యారు. గతంలో దేవేందర్ నగర్ కాలనీలో జరుగుతున్న ఘటనలపై పలమార్లు మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులు చేసినప్పటికీ తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని నిందితులను వదిలేయడం పరిపాటిగా మారింది. ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ,నిందితులను వదిలేస్తున్నారని,దీనికి అమాయకమైన, నిరుపేద ప్రజలు బలవుతున్నారని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తే ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా ఉంటాయి. కానీ ఇక్కడ పదే పదే గొడవలు,దాడులు, యదేచ్చగా సాగుతున్నాయి అంటే పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని డాక్టర్ రాపోలు రాములు అన్నారు. అంతేకాకుండా దేవేందర్ నగర్ కాలనీలో గంజాయి వంటి మాదకద్రవ్యాలు దొరకడం వాటిపై సరైన నిఘా లేకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గొడవలకు కూడా అదే ప్రధాన కారణం అని,దేవేందర్ నగర్ కాలనీలో మాదకద్రవ్యాలపై అమ్మకాలపై పోలీసులు ఉక్కు పాదం మోపి,గొడవలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజలు ప్రశాంతంగా జీవిస్తారని పోలీసులకు ఆయన సూచించారు.

## బదిలీపై వెళుతున్న సీఐ

## సత్యనారాయణకు ఘనంగా సన్మానం





మేడ్చల్(ప్రశ్న న్యూస్) మేడ్చల్ మండల కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ దుబ్బకోటి ఆంజనేయులు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోమారం రమణారెడ్డి మాజీ డీసీసీబీ ఉప అధ్యక్షులు గుమారం బాలారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఉడందాపురం సత్యనారాయణ కాంగ్రెస్ సీనియర్ నేత రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న సీఐ సత్యనారాయణ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండీ అలీమ్ మురళి మహేందర్ పాల్గొని మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా కప్పి సన్మానం చేసి మాట్లాడుతూ మేడ్చల్ కు సిఐ సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిపై విమర్శలు సహించం

**సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై**

**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతలు**

**నర్సారెడ్డి నాయకత్వంలో గజ్వేల్‌లో కాంగ్రెస్ మరింత**

**బలోపేతం అవుతుంది: కొండల్ రెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే టి. నర్సారెడ్డిపై సోషల్ మీడియా వేదికగా కొందరు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు, దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. నర్సారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి రోజురోజుకూ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. ఆయన నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వేగంగా బలోపేతం అవుతోందని, దీనిని జీర్ణించుకోలేక ప్రత్యర్థి పార్టీలకు చెందిన కొందరు కాంగ్రెస్‌లో చీలికలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసే వారిపై పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, సమీర్, మొనగారి రాజు, నక్క రాములు గౌడ్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, సురేష్, అజ్గర్, సాయిలుతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లన్నసాగర్-కొండపోచమ్మసాగర్‌లో

## వెంటనే నీళ్లు నింపాలి..రైతులను కాపాడాలి

**- వంటేరు ప్రతాప్ రెడ్డి**

**కొండపోచమ్మసాగర్ వద్ద బీఆర్ఎస్ మహాధర్నా..**

**సాగునీరు అందే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లలో వెంటనే గోదావరి జలాలను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కొండపోచమ్మసాగర్ వద్ద రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, "సాగునీరు మా హక్కు.. రైతుల పొలాలకు నీరు చేరే వరకు మా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో గోదావరి జలాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ కన్నెపల్లి బాహుబలి పంపులను ప్రారంభించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నుంచి ఎల్లంపల్లి మీదుగా మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. దీంతో హల్దీవాగు, కుడవెల్లివాగు, సంగారెడ్డి, రామారెడ్డి, కామారెడ్డి, బస్వాపూర్ కెనాల్స్‌కు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జలకళతో కళకళలాడిన రిజర్వాయర్లు నేడు ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయని, సాగునీరు లేక రైతులు పంటలు సాగు చేయలేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య కూడా రోజురోజుకు తీవ్రమవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.
కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు నిర్మించి, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో రైతులను ఆదుకుంటే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులకు సాగునీరు అందించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కృంగిన రెండు పిల్లర్లను కూడా మరమ్మతు చేయలేని ప్రభుత్వం రైతులకు ఏం న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. వెంటనే కన్నెపల్లి బాహుబలి పంపులను ప్రారంభించి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లను నింపి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ జాలీలతో ప్రాణాలకే ముప్పు

**గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా వేడి టీ వడకట్టేందుకు**

**ప్లాస్టిక్ జాలీల వినియోగం**

**ఫిర్యాదులు చేసినా స్పందించని మున్సిపల్ అధికారులు**

**తక్షణ తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న టీ దుకాణాలు, హోటళ్లుప్రమాదకర రసాయనాలు, మైక్రోప్లాస్టిక్స్ కలిసే ప్రమాదమని నిపుణుల హెచ్చరిక, సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు టీ దుకాణాలు, హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ జాలీలను ఉపయోగించడం ప్రజారోగ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పొగలు కక్కే వేడి టీని ప్లాస్టిక్ జాలీలతో వడకట్టడం వల్ల ప్లాస్టిక్‌లోని హానికర రసాయనాలు, మైక్రోప్లాస్టిక్స్ టీలో కలిసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలంగా ఇటువంటి టీని సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. టీ దుకాణాలు, హోటళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించకపోవడం, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత కలిగిన మున్సిపల్ యంత్రాంగం ఇలాంటి అంశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని స్థానికులు మండిపడుతున్నారు. ప్లాస్టిక్ జాలీల స్థానంలో స్టీల్ లేదా వస్త్రంతో తయారైన సురక్షిత వడపోత సాధనాలను మాత్రమే ఉపయోగించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని వారు కోరుతున్నారు. అంతేకాకుండా, మున్సిపల్ కమిషనర్ వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి, ప్లాస్టిక్ జాలీలను ఉపయోగిస్తున్న వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా కఠిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేడు శ్రీశైలంలో స్వామి,అమ్మవార్లకు ఊయలసేవ

## లోకకల్యాణం కోసం శాస్త్రోక్తంగా ప్రత్యేక నిర్వహణ



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) లోకకల్యాణం, భక్తుల ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ శ్రీశైలం దేవస్థానం శుక్రవారం సాయంత్రం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి--అమ్మవార్లకు వైభవంగా ఊయలసేవ నిర్వహించనుంది.దేవస్థానం సంప్రదాయం ప్రకారం ప్రతి శుక్రవారం, పౌర్ణమి, మూల నక్షత్రం రోజుల్లో ఈ సేవను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అర్చకులు లోకక్షేమార్థం సేవా సంకల్పం పఠించి, కార్యక్రమం నిర్విఘ్నంగా సాగాలని మహాగణపతి పూజ నిర్వహిస్తారు.అనంతరం ఊయలలో వేంచేపు చేసిన స్వామి--అమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధల మధ్య ఊయలసేవ జరుపుతారు. ఈ సందర్భంగా స్వామి--అమ్మవార్లను వివిధ రకాల సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించి, పుష్పార్చనలు నిర్వహించనున్నారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

# డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్ ఆకస్మిక తనిఖీ



వాజేడు( ప్రశ్న న్యూస్ )ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. క్రాంతి కుమార్ వాజేడు మండలంలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా చెరుకూరు ఉప ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, రికార్డుల నిర్వహణ, తల్లి-శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, గ్రామ స్థాయిలో అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు అనంతరం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఆరోగ్య కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు వేణుగోపాలకృష్ణ పీహెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధే మా లక్ష్యం

## - అగ్నిప్రమాదానికి గురైన డంపింగ్ యార్డును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్


## - ఆధునిక వసతులతో చెత్త నిర్వహణకు చర్యలు తీసుకుంటామని వెల్లడి



పటాన్‌చెరు( ప్రశ్న న్యూస్) ప్రజల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగానే మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైన డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ దశరథ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డులో నెలకొన్న పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా ఆధునిక వసతులతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే తమ లక్ష్యమని, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య, వార్డు కౌన్సిలర్లు కుమార్ గౌడ్, రమేష్, కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, వేణు, సత్యనారాయణ, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన భవన నిర్మాణాలకు స్థల పరిశీలన చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లాలోని నూతన మండలాలలో తహసిల్దార్ కార్యాలయానికి, సబ్ రిజిస్టర్ కార్యాలయాల నూతన భవన నిర్మాణానికి స్థలం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి గూగుల్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. నూతన మండలాలైన హవేలీ ఘనపూర్ ,నిజాంపేట, చిలిపిచేడు మండలాలకు తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన చేపట్టాలన్నారు .మెదక్ ,నర్సాపూర్, రామాయంపేట డివిజన్ పరిధిలో రిజిస్టర్ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థల సేకరణను వేగవంతం చేసి , స్థల సేకరణ సంబంధిత ఫైళ్లను ఉన్నతాధికారులకు నివేదించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ బవయ్య,తహసిల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

## పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ



పటాన్చెరు (ప్రశ్న న్యూస్ )ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ డివిజన్ కి చెందిన కూరపాటి రేణుక గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని శుక్రవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# దేవదుల పర్యటనతో ఏం సాధిస్తారు: బీజేపీ ప్రశ్న.

## ఏజెన్సీ సమస్యలపై స్పందించని బీఆర్ఎస్ అధ్యక్షుడు: జాడి రామరాజు

## మంత్రి ఆదేశాలతోనే లక్ష్మణ్ బాబు పర్యటన: బీజేపీ ఆరోపణ



ఏటూరునాగారం(ప్రశ్న న్యూస్) మంత్రి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పర్యటించి ఏమి సాధిస్తారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు ప్రశ్నించారు.ఏటూరునాగారంలో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ మైదాన ప్రాంత నాయకురాలు, మంత్రి ఆదేశాలతో లక్ష్మణ్ బాబు పర్యటిస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీయే ప్రత్యామ్నాయమని ప్రజలను నమ్మించేందుకు ఈ డ్రామా అని విమర్శించారు.

బీఆర్ఎస్ హయాంలో ఏటూరునాగారాన్ని రెవిన్యూ డివిజన్గా ప్రకటించినా ఆమోదం రాకపోవడంపై, బస్సు డిపో పనులు ఆలస్యంపై స్పందించని లక్ష్మణ్ బాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. దేవదుల నుంచి ఎన్ని టీఎంసీల నీరు మైదాన ప్రాంతానికి వెళ్తుందో చెప్పాలని సవాల్ చేశారు. మైదాన నాయకురాలితో చీకటి ఒప్పందం కంటే ఏజెన్సీ ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి

## మెదక్ పట్టణ టీఆర్ఎస్ కన్వీనర్, 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు.




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు దాదాపు 40 సంవత్సరాల క్రితం రూపొందించిన పాత మాస్టర్ ప్లాన్‌ల స్థానంలో నూతన మాస్టర్ ప్లాన్‌లు రూపొందించే ప్రక్రియలో భాగంగా, గత పాలకవర్గం మెదక్ పట్టణానికి సంబంధించిన సమగ్ర సర్వేలను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, నూతన మాస్టర్ ప్లాన్ అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల మెదక్ పట్టణ అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో కొత్త భవనాలకు నిర్మాణ అనుమతులు జారీ కావడం లేదని, దీంతో ప్రజలు అక్రమ నిర్మాణాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన నిర్మాణ అనుమతి ఫీజులు, ఆస్తి పన్నులు వంటి ఆదాయం కోల్పోయి ఆర్థికంగా నష్టపోతోందని పేర్కొన్నారు.ఇప్పటికే మాస్టర్ ప్లాన్ పరిధిలో నిర్మించిన భవనాలకు బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బీ=ా) ద్వారా పూర్తి స్థాయి అనుమతులు కల్పించాలని, అలాగే మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ను వెంటనే ఆమోదించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసి మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌కు త్వరితగతిన ఆమోదం వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పట్టణ భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# నేడు మెదక్ జిల్లాలో హీరో మంచు విష్ణు పర్యటన



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) టాలీవుడ్ హీరో మంచు విష్ణు శనివారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, టూరిజం శాఖ ఆహ్వానం మేరకు ఆయన జిల్లాకు వస్తున్నారని, అభిమానులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలకాలని కోరారు.పర్యటనలో భాగంగా ఉదయం 8:30 గంటలకు ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారిని దర్శించుకోనున్న మంచు విష్ణు, అనంతరం ఉదయం 9:45 గంటలకు చారిత్రక మెదక్ ఖిల్లాను సందర్శిస్తారు. అనంతరం ఉదయం 11:15 గంటలకు మెదక్ క్యాథడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, మీడియా ప్రతినిధులతో సమావేశం కానున్నారు.హీరో మంచు విష్ణు పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా పూర్తి చేశారని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్ తెలిపారు.

# పటాన్‌చెరు ఫాదర్ స్కూల్ విద్యార్థిని శ్రీహరిణికి కోచ్ అభినందనలు

## - మెదక్ జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక



పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్ ) మెదక్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 2 వరకు హైదరాబాద్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించనున్న 12వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ (బాలికల విభాగం) పోటీలకు పటాన్‌చెరు ఫాదర్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని శ్రీ హరిణి మెదక్ జిల్లా జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాలలో హర్షం వ్యక్తమైంది.ఈ సందర్భంగా స్కూల్ బాస్కెట్‌బాల్ కోచ్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్న శ్రీహరిణిని అభినందించారు. క్రమశిక్షణతో సాధన కొనసాగిస్తూ మెదక్ జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి కృషి చేసిన శ్రీ హరిణి ఆమె తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు కోచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షిస్తూ శ్రీ హరిణికి శుభాకాంక్షలు తెలిపారు.

# చీరాల తీరానికి రూ.250 కోట్ల అంతర్జాతీయ నోవోటెల్ హోటల్

## అకార్-శ్రీ భ్రమర గ్రూప్స్ మధ్య ఒప్పందం..

## కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొనడం




న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్)ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత పర్యాటక అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. చీరాల సమీపంలోని గవినివారిపాలెంలో రూ.250 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాల నోవోటెల్ బీచ్‌ఫ్రంట్ హోటల్ నిర్మాణానికి ప్రపంచ ప్రఖ్యాత హాస్పిటాలిటీ సంస్థ అకార్ (ూ౨ుశీ) మరియు శ్రీ భ్రమర గ్రూప్స్ మధ్య శుక్రవారం న్యూఢిల్లీలో ఒప్పందం కుదిరింది.3.15 ఎకరాల సముద్రతీర ప్రాంతంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో 225-250 అతిథి గదులు, విలాసవంతమైన సూట్లు, ఆధునిక రెస్టారెంట్లు, సమావేశాలు, విందుల కోసం ప్రత్యేక హాళ్లు, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్‌తో పాటు పలు వినోద సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలోనే అతిపెద్ద అంతర్జాతీయ బ్రాండెడ్ హాస్పిటాలిటీ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఇది నిలవనుంది.ఒప్పంద పత్రాలపై అకార్ ప్రతినిధులు, శ్రీ భ్రమర గ్రూప్స్ ఎండీ గళ్లా రామచంద్రరావు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక రంగాన్ని విస్తరించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో దేశ, విదేశీ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు.చీరాల తీర ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురానుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటక రంగం, హోటల్ పరిశ్రమ, స్థానిక వ్యాపారాల అభివృద్ధికి కూడా గణనీయమైన ఊతం లభించనుంది.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో బి ఎల్ ఓ లు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బిఎల్ఓ లకు సూచించారు.శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని అల్వాల్ మండలంలోని 9వ నంబరు పోలింగ్ స్టేషన్ దగ్గర నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ వో లు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వడంలోనూ అదే విధంగా పూరించిన ఫారాలను తీసుకోవడంలోనూ పూర్తి బాధ్యతగావ్యవహరించాలన్నారు ఫారాలు పూరించడంలో ఓటర్ల సందేహాలను నివృత్తి పరుస్తూ వారికి అవగాహన కల్పించాలన్నారు. సర్ ప్రక్రియను వేగవంతం చేస్తూనే తీసుకున్న ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. తీసుకున్న ఫారాల డిజిటలైజ్ ఏవిధంగా చేస్తున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు. అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సూపర్వైజర్లకు అందించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. రోజువారీ టార్గెట్ ను ఏ విధంగా పూర్తి చేయాలో అవసరమైన సలహాలు సూచనలు కలెక్టర్ బిఎల్ఓలకు ఇచ్చారు.

## 'కొరియన్ కనకరాజు' లో స్పెషల్ సాంగ్ చేసిన హీరోయిన్ దక్షా నాగర్కర్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్టైనర్ 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే భారీ అంచనాలను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్ , ఫస్ట్ సింగిల్ 'కంసంనిద', టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. 'రాసగుమ్మడి' ఫుల్ లిరికల్ సాంగ్‌ను జూలై 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వరుణ్ తేజ్, హీరోయిన్ దక్షా నాగర్కర్ కలర్ ఫుల్ లుక్‌తో విడుదలైన సాంగ్ అనౌన్స్మెంట్ పోస్టర్ మాస్-ఫెస్టివ్ సాంగ్ వైబ్ ని క్రియేట్ చేస్తోంది. కొరియన్ కనకరాజు లో దక్షా నాగర్కర్ స్పెషల్ సాంగ్ చేస్తోంది. వరుణ్ తేజ్, దక్షా నాగర్కర్‌పై చిత్రీకరించిన రాసగుమ్మడి సాంగ్ కలర్‌ఫుల్ రాయలసీమ జాతర నేపథ్యంలో తెరకెక్కిన మాస్ డ్యాన్స్ నంబర్‌గా ఉండబోతోంది. పోస్టర్‌లో ఇద్దరి ఎనర్జిటిక్ లుక్స్, ఫెస్టివ్ వైబ్స్ పాటపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. థమన్ సంగీతం అందించిన ఈ పాట మరో చార్ట్‌బస్టర్‌గా కానుంది. ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందించగా, మనోజ్ రెడ్డి కటసాని డీవోపీగా పని చేస్తున్నారు. సరికొత్త కాన్సెప్ట్, ఆకట్టుకునే విజువల్స్, కమర్షియల్ ట్రీట్‌తో ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య


# 'ఏక్ దిన్' మూవీ రివ్యూ!



తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో సాయిపల్లవికి ఎంతో క్రేజ్ ఉంది. సాయిపల్లవి ఒక కథకు ఓకే చెప్పిందంటే, ఆ కథలో ఏదో బలమైన పాయింట్ ఉండి ఉంటుందని అభిమానులు భావిస్తూ ఉంటారు. అలాంటి సాయిపల్లవి తొలిసారిగా ఒక హిందీ సినిమా చేసింది. ఆ సినిమా పేరే 'ఏక్ దిన్'. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, మే 1వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'అమెజాన్ ప్రైమ్' దక్కించుకుంది. ఈ రోజు (జులై 17) నుంచి ఈ సినిమా హిందీతో పాటు ఇతర భాషల్లో అందుబాటులోకి వచ్చింది. దినేష్ (జునైద్ ఖాన్) ఒక సాఫ్ట్ వేర్ సంస్థలో పనిచేస్తూ ఉంటాడు. అదే ఆఫీసులో మీరా రంగనాథ్ (సాయిపల్లవి) వర్క్ చేస్తూ ఉంటుంది. ఆమెను చూడగానే అతను మనసు పారేసుకుంటాడు. అయితే ఆమె ఆ సంస్థకి చెందిన 'నకుల్' (కునాల్ కపూర్)తో చనువుగా ఉండటం చూసి చాలా ఆవేదన చెందుతూ ఉంటాడు. నకుల్ తన భార్య 'రీతూ' (జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్)తో విడాకులు తీసుకోనున్నట్టు మీరాతో చెబుతాడు. మీరా పట్ల తనకి గల ప్రేమను వ్యక్తం చేస్తాడు. మీరాకి 'జపాన్'ను చూడాలనే కోరిక చిన్నప్పటి నుంచి బలంగా ఉంటుంది. ఆ విషయం నకుల్ కి తెలుసు. ఆ ఏడాది తాము టార్గెట్ రీచ్ అయ్యామంటూ, అతను ఎంప్లాయిస్ ను జపాన్ తీసుకుని వెళతాడు. అక్కడ నకుల్ తో మీరా మరింత సాన్నిహిత్యంగా ఉండటం చూసి, దినేష్ బాధపడతాడు. అయితే అనుకోకుండా అక్కడికి నకుల్ భార్య 'రీతూ' వస్తుంది. ఆమె గర్భవతి అని మీరాకి తెలుస్తుంది. రీతూకి విడాకులు ఇవ్వనున్నట్టు తనకి నకుల్ చెప్పింది అబద్ధమని గ్రహిస్తుంది. తనని నకుల్ మోసం చేయడాన్ని తట్టుకోలేని మీరా, విపరీతంగా తాగేసి ప్రమాదానికి గురవుతుంది. ఆమెను హాస్పిటల్లో చేరుస్తాడు దినేష్. ఆమె తన గతాన్ని మరిచిపోయిందనీ, 24 గంటల తరువాత గతం గుర్తుకు వస్తుందని డాక్టర్లు చెబుతారు. అయితే గతం గుర్తుకు వచ్చిన తరువాత, ఈ 24 గంటలలో ఏం జరిగిందనేది ఆమెకి ఎంతమాత్రం గుర్తుకురాదని అంటారు. అప్పుడు దినేష్ ఏం చేస్తాడు? ఒక్కరోజుపాటు తనతో మీరా ప్రేమగా ఉన్నా చాలనుకున్న అతని కోరిక నెరవేరుతుందా? ఆ రోజు తరువాత, దినేష్ తో గడిపిన క్షణాలు ఆమెకి గుర్తుంటాయా? అనేది మిగతా కథ. శ్రీమంతుడైన ఒక యువకుడు తన ఆఫీసులో పనిచేసే 'మీరా'పై కన్నేస్తాడు. తన భార్య మంచిది కాదంటూ, మీరాకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తాడు. జపాన్ చూడాలనే ఆమెలోని కోరికను తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. మిగతా ఎంప్లాయిస్ తో పాటు అక్కడికి తీసుకుని వెళతాడు. ఆమెను సొంతం చేసుకోవడానికి రంగాన్ని సిద్ధం చేస్తాడు. అతని నిజస్వరూపం తెలుసుకున్న మీరా ప్రమాదానికి గురవుతుంది. ఆమెను మౌనంగా ఆరాధిస్తూ .. అనుసరిస్తూ వస్తున్న దినేష్ ఏం చేస్తాడు? అనే అంశం చుట్టూ నడిచే కథ ఇది. ఈ కథ అంతా మీరా .. నకుల్ .. దినేష్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమ పేరుతో ఆకర్షించే నకుల్, ప్రేమ అనుకుని ఆకర్షణ దిశగా పరిగెత్తే మీరా, ఆమె ప్రేమ కోసం ఎంతకాలమైనా ఎదురు చూడొచ్చునని భావించే దినేష్ పాత్రలు ఈ కథలో ప్రధానమైనవి. కథను మొదటి నుంచి చివరి వరకూ నడిపించేంత కీలకమైనవి. తెరపై ఎక్కువగా ఈ మూడు పాత్రలు మాత్రమే కనిపించినా, ఎక్కడా బోర్ అనిపించదు. ప్రతి సన్నివేశంలోని ఫీల్ కనెక్ట్ అవుతుంది. జీవితంలో ఎవరు ఎలాంటి వాళ్లు అనేది తెలియాలంటే అవసరమో .. ఆపదో రావాలంటారు. అప్పుడే మనతో నిలబడేదెవరో .. మనలను నిలబెట్టేదెవరో అర్థమైపోతుంది. సరిగ్గా ఆ పాయింట్ ను టచ్ చేస్తూనే దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. నిజమైన ప్రేమను పంచే మనసును .. వాళ్ల పలకరింపును .. స్పర్శను మరిచిపోవడం అసాధ్యమనే విషయాన్ని దర్శకుడు ఆవిష్కరించిన విధానం గొప్పగా అనిపిస్తుంది. సాయిపల్లవి నటన ఈ సినిమాకి హైలైట్ అని చెప్పాలి. ఆడంబరాలు .. ఆకర్షణలు కాదు, ప్రేమించడానికి మంచి మనసు ఉండాలని నిరూపించే పాత్రలో జునైద్ కూడా నీట్ గా చేశాడు. అవసరం .. అవకాశం తప్ప మనిషికీ .. మనిషికి మధ్య మరేమీ ఉండదనే పాత్రలో కునాల్ నటన కూడా ఆకట్టుకుంటుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ .. లొకేషన్స్ ఈ కథను మరింత సపోర్టు చేస్తూ సాగుతాయి. జీవితంలో మనలను ప్రేమించే మనిషంటూ ఒకరి ఉంటే, ఆ ప్రయాణం ఎంతో అందంగా .. అనుభూతి మయంగా ఉంటుంది. అలాంటి ప్రేమను అర్థం చేసుకోలేకపోతే ఆ వెలితి వెంటాడుతూ ఉంటుంది. నిజమైన ప్రేమ .. నిస్వార్థమైన ప్రేమ ఓడిపోయిన దాఖలాలు దాదాపుగా లేవని నిరూపించే ఈ కథ, ఫ్యామిలీ ఆడియన్స్ కి తప్పకుండా కనెక్ట్ అవుతుంది.

## తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్

### – బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓ..! సుకుమారి... మూవీ రివ్యూ



'మసూద' చిత్రం తరువాత హీరో తిరువీర్ పలు చిత్రాల్లో నటించిన సరైన సక్సెస్ దక్కలేదు. ఈ సారి ఆయన ప్రముఖ కథానాయిక ఐశ్వర్య రాజేష్‌తో జోడి కట్టాడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఓ..! సుకుమారి..' ఓ వినూత్న కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలోని వినోదం ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసిందా? ఈ చిత్రంతో తిరువీర్‌కు విజయం దక్కిందా? లేదా అనేది రివ్యూలో తెలుసుకుందాం. యాదగిరి అలియాస్ యాది (తిరువీర్) పెళ్లి ప్రయత్నాల్లో ఉంటాడు. తమ పక్క ఊరిలోని ఓ అమ్మాయిని పెళ్లి చూపులు చూడటానికి వెళ్లి దామిని (ఐశ్వర్య రాజేష్)ని తొలిచూపులోనే ప్రేమిస్తాడు. ఎలాగైనా ఆమెనే పెళ్లి చేసుకోవాలని ఫిక్సయిపోతాడు. ఇక ఆ ఊళ్లో కూడా ఎలాగైనా దామినికి పెళ్లి చేసి ఊరి నుంచి పంపించేయాలని ఊరి ప్రజలు చూస్తుంటారు. దానికి కారణం ఆమెకు ఓ గమ్మత్తైన సమస్య ఉండటమే కారణం. ఆమెను ఎవరూ టచ్ చేసిన షాక్ కొడుతుంది. ఈ ప్రాబ్లమ్ వల్ల ఊరిలో జనాలు ఇబ్బంది పడుతుంటారు. అందుకే యాది ఇష్టపడిన వెంటనే అందరూ కలిసి దామిని పెళ్లి చేస్తారు. ఇక అసలు కథ ఇక్కడే ప్రారంభమవుతుంది. ముట్టుకుంటే షాక్ కొట్టే దామినితో యాది ఎలా కాపురం చేశాడు? అత్తారింట్లో దామినికి ఎదురైన పరిస్థితులు ఏమిటి? ఆమెకున్న సమస్యను భర్త ఎప్పుడు ఎలా తెలుసుకున్నాడు? యాది అసలు దామినిని పెళ్లి చేసుకోవడానికి కారణం ఏమిటి? అనేది మిగతా కథ. ఈ మధ్య తెలుగు సినిమాల్లో కథానాయకుడు లేకపోతే కథానాయికకి ఇలాంటి విచిత్రమైన సమస్యలు పెట్టి దాని చుట్టు కథ అల్లుకుంటున్నారు. ఇటీవల తిరువీర్ నటించిన 'పాపం ప్రతాప్' సినిమా, కెర్యాంప్‌లో హీరోయిన్‌కు ఓ గమ్మత్తైన సమస్య.. ఇలా ఈ సమస్య చుట్టు వినోదాన్ని అల్లుకుని దర్శకులు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది ఆ కోవలోనే హీరోయిన్ ఐశ్వర్య రాజేష్‌కు ముట్టుకుంటే షాక్ కొడుతుందనే విచిత్రమైన సమస్య నేపథ్యంగా ఈ సినిమా కథను తయారుచేసుకున్నారు. అయితే షాక్ కొట్టే అమ్మాయి, ఆ విషయం తెలియక పెళ్లి చేసుకున్న అబ్బాయి, ఇక ఈ ఇద్దరి మధ్య కాపురం ఎలా జరిగింది? ఇదంతా వినూత్నమైన పాయింటే. ఈ సమస్య చుట్టు కథనంను, వినోదాన్ని ప్రేక్షకులను ఎంగేజ్ చేసే విధంగా అల్లుకోవడమే అసలు ప్రతిభ. ఇలాంటి కథలను తెరపై ప్రజెంట్ చేయాలంటే దర్శకుడు చాలా లాజికల్‌గా ఆలోచించాలి. ఆ మేరకు స్క్రీన్‌ప్లేతో పాటు కడుపుబ్బా నవ్వించే వినోదాన్ని యాడ్ చేయాలి. అయితే దర్శకుడు ఈ సమస్య గురించి పెద్దగా చర్చించకుండా, ఎటువంటి లాజిక్స్ లేకుండా సినిమాను ముగించే ప్రయత్నం చేశాడు. ఫస్టాఫ్‌గా సో..సోగా సాగిన సెకండాఫ్ మరింత విసుగు పుట్టించే విధంగా దర్శకుడు చిత్రాన్ని రొటిన్‌గా తెరకెక్కించాడు. సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ కోసం పాత్రలు ప్రయత్నించినా అది వృథా ప్రయాసగానే మిగిలింది. ఆ కామెడీ నవ్వు రాకపోగా విసుగొస్తుంది. సినిమా కాన్సెప్ట్‌లో మినహా, సన్నివేశాల్లో, సంభాషణల్లో ఎక్కడా కూడా కొత్తదనం కనిపించదు. పరమ రొటిన్‌గా సినిమాను భరించాల్సి వస్తుంది. కాన్సెప్ట్ అనుకోగానే సరిపోదు. అందుకు రచనా పరంగా సరైనా వర్క్ చేయాలి. అది ఈ సినిమా విషయంలో నూటికి నూరుశాతం లోపించింది. యాదగిరి పాత్రలో అమాయకుడిగా తిరువీర్ నటించారు. అయితే తిరువీర్ ఈ మధ్య అన్ని ఒకే రకమైన పాత్రలు చేస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. అవసరమైతే కొంత గ్యాప్ తీసుకోని ఓ మంచి స్టోరీతో తిరువీర్ రావాల్సిన అవసరం ఉంది. ఐశ్వర్య రాజేష్ పాత్ర వినూత్నంగా ఉందని ఆమె ఈ సినిమా ఒప్పుకున్నట్లు ఆమె పాత్ర చూస్తే అర్థమవుతుంది.

అయితే ఆమె పాత్రకు మాత్రం న్యాయం చేసింది. దర్శకుడు బలమైన సన్నివేశాలు రాసుకోవకపోవడం వల్ల వీళ్ల ప్రతిభ చూసే అవకాశం సినిమాలో రాలేదు. ఝాన్సీ, మురళీధర్ గౌడ్ తమ రెగ్యులర్ పాత్రల్లోనే కనిపించారు. కమెడియన్ విష్ణు కాసిని నవ్వులు పంచే ప్రయత్నం చేశాడు. ఆమని, శ్రీనివాస్ గవిరెడ్డి, ఆనంద్ తదితరులు తమ పరిధి మేరకు నటించారు. ఓవరాల్‌గా ఓ..! సుకుమారి..! ఐడియా బాగున్నా కథనం మీ ఓపికకు పరీక్ష పెడుతుంది. కాన్సెప్ట్ పరంగా సుకుమారిగా ఉన్నా...సినిమా ఆద్యంతం భరించాలంటే కఠినంగానే ఉంటుంది. . రొటిన్ కథనంతో, పండని హాస్యంతో, కొరవడిన భావోద్వేగాలతో, మీ ఓపికకు పరీక్ష పెట్టే ఈ సుకుమారి ఆడియన్స్‌కు కూడా షాకులు ఇచ్చింది..!

## సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు. ఈ క్రమంలో, కాజల్ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది. నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు. ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా వ్యవహరించాయి. సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు, నిర్మాతగానూ వ్యవహరించారు. ఈ చిత్రం జూలై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. కాజల్ సృష్టించిన ఈ ఛాలెంజ్ నెటిజన్ల నుంచి మంచి స్పందన అందుకుంటోంది.

## హారర్ థ్రిల్లర్ 'ఆమెన్'



ఎస్‌బీకే ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై దర్శక నిర్మాత ఎస్‌కే బషీద్ రూపొందించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆమెన్' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఆయన చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాలకు పూర్తి భిన్నంగా ఉండే చిత్రమిది. కొత్త నటీనటులతో తెరకెక్కించాం. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. గుండె జబ్బులు ఉన్నవారు థియేటర్‌కు రావొద్దు. ఆద్యంతం ప్రేక్షకుల్లో ఉత్కంఠను కలిగిస్తూ అనూహ్య మలుపులతో ఆకట్టుకుంటుంది. ఇటీవల విడుదల చేసిన పోస్టర్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాత, దర్శకత్వం: ఎస్‌కే బషీద్.

# కోనసీమ తిరుమలకు టెంపుల్ టౌన్ ప్రతిపాదన

**వాడపల్లి అభివృద్ధికి సీఎం దృష్టికి ఎమ్మెల్యే సత్యానందరావు వినతి**



కొత్తపేట(ప్రశ్న న్యూస్) కోనసీమలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన 'టెంపుల్ టౌన్' గా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను ముఖ్యమంత్రికి అందజేశారు. కోనసీమ తిరుమలగా పేరొందిన ఈ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్తపేటలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని, వాడపల్లి దేవస్థానం వద్ద భక్తుల వసతి కోసం 'శ్రీనివాసం--2' భవన నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ఇతర అభివృద్ధి పనులకు కూడా తగిన నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చెందితే కోనసీమలో ఆధ్యాత్మిక పర్యాటకం మరింత విస్తరించడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గానికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# డిజిటల్ విధానంలో ఎరువుల పంపిణీ

**ఖరీఫ్‌కు కొరత ఉండదు: అచ్చెన్నాయుడు**

**బ్లాక్‌మార్కెట్‌కు అడ్డుకట్ట ప్రతి రైతుకు సకాలంలో సరఫరా**



కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్) ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఆగ్రా×మీ 2.0) ద్వారా ఎరువుల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. ఈ విధానంతో బ్లాక్‌మార్కెట్, అక్రమ మళ్లింపులకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేటు ఎరువుల డీలర్లను డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించి, భూవివరాలు, పంట రకం, సాగు విస్తీర్ణం ఆధారంగా శాస్త్రీయ సిఫార్సుల మేరకు ఎరువుల అర్హతను నిర్ణయించి పంపిణీ చేస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎరువుల కొరత రాకుండా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నమోదు కాకపోయినా ఇబ్బంది లేదు

ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు కాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. అలాంటి రైతుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, వారికి కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించే ఏర్పాట్లు చేశామని చెప్పారు.

### ప్రతి విక్రయంపై ఆన్‌లైన్ నిఘా

ప్రతి ఎరువు విక్రయం ఆన్‌లైన్‌లో నమోదు కావడంతో అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెట్, దుర్వినియోగానికి అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందించేందుకు కట్టుబడి ఉందని, రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ప్రభుత్వ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

# ఏపీ సాంస్కృతిక ప్రతిపాదనలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**నెల రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ**

**కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శితో మంత్రి కందుల దుర్గేష్ భేటీ**

**ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్‌లో ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానం**




న్యూఢిల్లీ/అమరావతి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక ప్రాజెక్టులకు కేంద్రం సానుకూల సంకేతాలు ఇచ్చింది. కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్‌తో శుక్రవారం సమావేశమైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఐదు కీలక ప్రతిపాదనలను సమర్పించారు. వీటికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చి నెల రోజుల్లో అధికారిక సర్క్యులర్ జారీ చేస్తామని కేంద్ర కార్యదర్శి హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

### ఐదు కీలక ప్రతిపాదనలు

రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రం, రాష్ట్రంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్) కేంద్రం, లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం, విజయవాడలో జి.వి.ఆర్. ప్రభుత్వ సంగీత--నృత్య కళాశాల ప్రాంగణంలో ఆధునిక కళాక్షేత్ర ఆడిటోరియం నిర్మాణం, కడపలో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రి కేంద్రానికి అందజేశారు.

ఈ ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రాష్ట్ర సాంస్కృతిక రంగానికి శుభపరిణామమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కళాకారులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక సంస్థలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

### ఏపీకి పెట్టుబడుల ఆహ్వానం

న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్--2026లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్ర పర్యాటక రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక ప్రాజెక్టులకు అనుకూల వాతావరణం ఉందని, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కాన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన ఏపీ టూరిజం స్టాల్‌ను సందర్శించిన మంత్రి, రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి పర్యాటక విశిష్టతలను సందర్శకులకు వివరించారు. పర్యాటక రంగాన్ని ప్రపంచస్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

### ఇన్వెస్టర్లతో ప్రత్యేక సమావేశాలు

పర్యటనలో భాగంగా పలువురు జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ ప్రతినిధులు, పెట్టుబడిదారులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో భాగస్వామ్యం కావాలని వారికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆంధ్రప్రదేశ్‌లోని పెట్టుబడి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.

రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక రంగాలకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# సిజేరియన్లకు కళ్లెం

**మూడేళ్లలో 35 శాతానికి తగ్గించాలి**

**ప్రతి ఆపరేషన్‌కు తప్పనిసరిగా కారణాలు నమోదు చేయాలి**

**డయాగ్నస్టిక్ పరీక్షల్లో రద్దీకి చెక్**

**ప్రభుత్వ యంత్రాల వినియోగం పెంచాలి**

**ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు**



అమరావతి(ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పెరుగుతున్న సిజేరియన్ ప్రసవాలకు కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 51 శాతానికి చేరిన సిజేరియన్ ప్రసవాలను వచ్చే మూడేళ్లలో 35 శాతానికి తగ్గించేలా కార్యాచరణ రూపొందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రతి సిజేరియన్‌కు వైద్యపరమైన కారణాలు తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆడిటింగ్‌ను కట్టుదిట్టం చేయాలని స్పష్టం చేశారు. సిజేరియన్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాగ్నస్టిక్ సేవల నిర్వహణపై శుక్రవారం సచివాలయంలో మూడు గంటలకు పైగా ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

### సహజ ప్రసవాలే శ్రేయస్కరం

ప్రతి మహిళ జీవితంలో ప్రసవ వేదన అనిర్వచనీయమైన అనుభూతి అని, సహజ ప్రసవం తల్లీబిడ్డల మధ్య ఆప్యాయ బంధాన్ని మరింత బలపరుస్తుందని మంత్రి పేర్కొన్నారు. సిజేరియన్ తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ, తల్లి ఆరోగ్యం, శిశువు సంక్షేమం దృష్ట్యా సహజ ప్రసవమే ఉత్తమమని వైద్య నిపుణులు సమావేశంలో వివరించారు. అనివార్య పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాలని, సాధారణ ప్రక్రియగా మారిపోవడం ఆందోళనకరమని మంత్రి వ్యాఖ్యానించారు.

### దేశంలో నాలుగో స్థానం.. ఆందోళన

2025-26 గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సగటు సిజేరియన్ ప్రసవాలు 30.13 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 53.85 శాతానికి చేరి దేశంలో నాలుగో స్థానంలో నిలవడం ఆమోదయోగ్యం కాదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏడాదిలో నమోదైన 5.20 లక్షల ప్రసవాల్లో 2.80 లక్షలకు పైగా సిజేరియన్లు జరిగాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 40.31 శాతం, ప్రైవేటు ఆస్పత్రుల్లో 63.84 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

### ప్రతి సిజేరియన్‌పై ఆడిట్

2028-29 నాటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లను 43 శాతం నుంచి 24 శాతానికి, ప్రైవేటు ఆస్పత్రుల్లో 64 శాతం నుంచి 47 శాతానికి తగ్గించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. తొలి దశలో 20 ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలరోజుల పాటు సిజేరియన్లపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి కారణాలను విశ్లేషించాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులపై డీఎంహెచ్‌వోల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

### సహజ ప్రసవాలకు ప్రోత్సాహం

ప్రస్తుతం సిజేరియన్, సహజ ప్రసవాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న ప్యాకేజీలను సమీక్షించి, సహజ ప్రసవాలను ప్రోత్సహించేలా కొత్త విధానం రూపొందించాలని మంత్రి సూచించారు. సహజ ప్రసవం ద్వారా శిశువుకు జన్మనిచ్చే తల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.

### డయాగ్నస్టిక్ పరీక్షలకు టోకెన్ విధానం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీటీ స్కాన్, ఎమ్మార్ఐ, ఎక్స్‌రే వంటి పరీక్షల కోసం రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితిని మార్చాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రోగికి టోకెన్ ఇచ్చి, నిర్ణీత సమయంలో పరీక్షలు నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. విశాఖ కేజీహెచ్, విజయవాడ జీజీహెచ్‌తో పాటు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని తెలిపారు.

### ప్రభుత్వ యంత్రాల వినియోగం పెంచాలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాగ్నస్టిక్ యంత్రాల వినియోగం తక్కువగా ఉండగా, పీపీపీ విధానంలో పనిచేస్తున్న యంత్రాల వినియోగం ఎక్కువగా ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత వంటి కారణాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో

వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్ బాబు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విష్ణువర్ధన్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంగళగిరికి కొత్త ఊపు

**అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభం**

**దేశాభివృద్ధికి రైల్వేలే వెన్నెముక**

**: మంత్రి నారా లోకేష్**

**దక్షిణ భారతదేశంలో నంబర్-1 రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం**

**మంగళగిరికి పరిశ్రమలు.. యువతకు స్థానికంగానే ఉద్యోగాలే లక్ష్యం**

మంగళగిరి(ప్రశ్న న్యూస్) దేశ ఆర్థికాభివృద్ధిలో భారతీయ రైల్వేలది కీలకపాత్ర అని, ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాలే అభివృద్ధికి బలమైన పునాది అని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.12.56 కోట్లతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్న లోకేష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ రైల్వే దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిందని, దేశాన్ని ఒకే దారంలో కలిపే గొప్ప వ్యవస్థ రైల్వేనని ఆయన పేర్కొన్నారు. గతంలో రద్దీ స్టేషన్లు, ఆలస్యమయ్యే రైళ్లు, పాత మౌలిక సదుపాయాలతో గుర్తింపు పొందిన రైల్వేలు.. ప్రస్తుతం వందేభారత్ రైళ్లు, కవచ్ భద్రతా వ్యవస్థ, వందశాతం విద్యుదీకరణ, ఆధునిక సరుకు రవాణా కారిడార్లు, బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని వివరించారు.

### రైల్వేల్లో విప్లవాత్మక మార్పులు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆధ్వర్యంలో భారతీయ రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ఆధునీకరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. వేల కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాల నిర్మాణం, ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు, హైడ్రోజన్ రైళ్ల వంటి ప్రాజెక్టులు భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని చెప్పారు. మంగళగిరి రైల్వే స్టేషన్‌లో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరారు.

### అమరావతి అభివృద్ధికి రవాణా అనుసంధానం కీలకం

ప్రజారాజధాని అమరావతి నిర్మాణం కేవలం భవనాలకే పరిమితం కాదని, రహదారి, రైల్వే, విమాన రవాణా అనుసంధానంతో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని లోకేష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సమగ్ర లాజిస్టిక్స్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ఐదేళ్లలో నిలిచిపోయిన అమరావతి పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.

### దక్షిణాదిలో అగ్రస్థానమే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలో నంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి పనిచేస్తుండటంతో రాష్ట్రానికి భారీ ప్రాజెక్టులు, పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్ట్ రైల్వే జోన్, పోలవరం నిధులు, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి అంశాలు కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి నిదర్శనమన్నారు.

### మంగళగిరిలో అభివృద్ధి జోరు

గత రెండేళ్లలో మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ, వంద పడకల ఆసుపత్రి, కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాల అభివృద్ధి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి, రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల విశ్వాసంతోనే తాను భారీ మెజార్టీతో గెలిచానని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యత తనపై ఉందన్నారు.



### యువతకు ఉద్యోగాలే లక్ష్యం

రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, ఏఎంసీఏ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, రానున్న మూడేళ్లలో నిరుద్యోగ యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరికి కూడా పరిశ్రమలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీవారికి శ్రీరంగం నుంచి పట్టువస్త్రాల సమర్పణ

**ఆణివార ఆస్థానం సందర్భంగా వైభవంగా ఊరేగింపు**



తిరుమల(ప్రశ్న న్యూస్)ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీరంగం శ్రీరంగనాథస్వామి ఆలయం తరఫున శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని తిరుమల పెద్ద జీయర్ మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి రమేష్, ఆ శాఖ కమిషనర్ వినయ్ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.

శ్రీవారి ఆలయంలో అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తిపూర్వక వాతావరణంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, తమిళనాడు దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ రవిచంద్ర, శ్రీరంగం ఆలయ ఈవో శివరామ్ కుమార్, ప్రధాన అర్చకులు సుందర బట్టర్‌తో పాటు పలువురు అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి కట్టుబడి ఉంది

**త్వరలో వెలిగొండ నీటిని అందిస్తాం**

**- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**త్రిపురాంతకంలో ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వెల్లడి**



త్రిపురాంతకం(ప్రశ్న న్యూస్) హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అదే సమయంలో అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. త్రిపురాంతకంలోని శ్రీ బాలత్రిపురసుందరి దేవి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ఆలయాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మార్కాపురం జిల్లా హామీని నిలబెట్టుకున్నాంఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. వెలిగొండ పనులు వేగవంతంగత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకముందే జాతికి అంకితం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించిందని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వెలిగొండ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోందని తెలిపారు. త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటిని అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హామీ ఇచ్చారు.

# "శ్రీనివాసుని పుట్టినరోజు" శిగమెత్తిన శ్రీ అభిమానులు

- కూరగాయల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు - అసోసియేషన్ అధ్యక్షుడు ఫుల్ సపోర్ట్ తో పెట్రేగి పోతున్న సదరు కమీషన్ ఏజెంట్లు
- అసోసియేషన్ నాయకులు నయా స్టెప్పులతో యువకులను ఆకట్టుకున్నారు బోయిన్ పల్లి మార్కెట్‌లో వ్యాపారం కోసం షాపులు కేటాయిస్తే,జన్మదిన ముసుగులో "కత్తులు,
- కటరాలతో వేడుకలో "తీన్మార్ డ్యాన్స్ లు" - మందేస్తూ చిందులు, మామూలు అరుపులు కావు,కర్ణభేరి పగిలే డిజెలు
- బస్తీలు,కాలనీలు వీరి వెక్కిరి చేష్టలకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు
- మార్కెట్ సెక్రటరీ పరివేక్షన లోపం,అన్ని అనార్థాలకు ఆయననే కారణం,మూడు రోజుల క్రితం బయటి వాళ్ళు సుమారు"50"మంది కమీషన్ ఏజెంట్ల పై దాడి, ఇరువర్గాలకు "8"నుంచి నాలుగు కుట్లు పడినట్లు సమాచారం
- బోయిన్ పల్లి మార్కెట్ లో మారణాయుధాలతో గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం ప్లాన్ తో వచ్చి దాడి చేసి పరారయ్యారు.వీటికన్నీంటికి కారణం
- "శ్రీ, శ్రీ" లే. లైసెన్స్ లేని వాళ్లు న్యూసెన్స్ తో మార్కెట్ నాశనానికి బీజం వేస్తున్నారు - రైతు వేదికల్లో"కమీషన్ ఏజెంట్లు "దందా ఎక్కువై ధనదాహంతో గలీజ్ పనులకు మార్కెట్ నీ అడ్డాగా మార్చుకున్నారు
- అడిగే వాడు లేడని మద్యం, ప్యాకాటతో దినం గడుపుతున్నారా.?







**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** దేశంలోనే అత్యంత ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.ఈ కూరగాయల మార్కెట్ పై దేశ ప్రధాని మనికీ బాత్ లో బోయిన్ పల్లి మార్కెట్ పై ప్రశంశల వర్షం కురిపించారు.తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులు "197" నూతనంగా మరో ఇరవై అందుబాటులో రానున్నాయి.అయితే డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి ప్రతి రోజూ ఇరవై ఏడు వేల టన్నుల కూరగాయలు వివిధ రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అది గాక బోయిన్ పల్లి మార్కెట్ కి ప్రతి దినం ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. జంటనగరాల్లో ఉన్న చిన్న చితిక నుంచి బడా హోటల్స్ వరకు ఖరీదు దారులు బోయిన్ పల్లి మార్కెట్ కి వస్తుంటారు.ఇంత పెద్ద మార్కెట్ లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు "2001" డిసెంబర్ "20"న సుమారు "175"దుకాణాలకు లైసెన్స్ లు అందజేశారు.పన్నెండేళ్లు వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ప్రకారం కమీషన్ ఏజెంట్లు వ్యాపార లావాదేవీలు నిర్వహించే వారు.వ్యాపారస్థులు రూల్స్ ప్రకారమే బిజినెస్ చేస్తున్నారా లేదా అని గ్రేడ్ వన్,సెక్రటరీ స్థాయి అధికారి నిత్యం పరివేక్షన ఉండేది.కానీ గత పదేళ్ళలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అంతా "రాబందుల"మయం అయిపోయింది.దీనికి తోడు అధికారులు కూడా చేతులు కలిపి మార్కెట్ యార్డును నాశనం చేస్తున్నారు.వీరి పై వ్యవసాయ విజిలెన్స్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు అందిన విషయం విదితమే.గత కొన్ని రోజుల క్రితం కూడా బోయిన్ పల్లి మార్కెట్ లో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే.

**బోయిన్ పల్లి మార్కెట్ లో తెల్లవారుజామున "4"గంటల నుంచి మధ్యాహ్నం "1"గంట వరకు కూరగాయల వ్యాపారం.ఆతర్వాత మద్యం,ప్యాకాట,తీన్మార్ డ్యాన్స్ లు:**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయంలో మార్కెట్ వర్గాలు.ఆర్థికంగా బాగ స్థిర పడిన వ్యక్తులు ఎవరైనా పుట్టినరోజు ఉంటే ఆ రోజు బ్యాండ్ బాజా బారాత్ తో చిందులే చిందులు,మరో విషయం ఏమిటంటే సదరు వ్యక్తికి శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద సైజులో ఉన్న గజమాల తో సన్మానం చేస్తూ పెద్ద పెద్దగా నినాదాలు చేస్తూ, తీన్మార్ డ్యాన్స్ లతో అదరకొట్టారు.సిగ్గులేకుండా స్టెప్పులు వేస్తూ సంబరాల్లో మునిగి తేలుతున్నారు.అసలు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ఏమైనా ఫంక్షన్ హాలా ? మార్కెట్ సెక్యూరిటీ,యార్డ్ సిబ్బంది ఇంతపెద్ద సెటప్ తో యార్డులోకి వస్తుంటే అడ్డుకున్న నాథుడే కరువైయ్యాడు.ఇంత పెద్ద బ్యాండ్ బాజాతో సౌండ్ సిస్టంతో పాటలతో అదర కొడుతుంటే మార్కెట్ అధికారులు ఏం చేస్తున్నారో ఈ తతంగం మధ్యాహ్నం నుంచి జరుగుతుంటే యార్డులో అధికారులు, సిబ్బంది "లీవ్"లో ఉన్నారాఅనే విషయం ఉత్పన్నం అవుతుంది.ఊహించలేని మరో విషయం ఏమిటంటే సాక్షాత్తూ "సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు "సోమ దేవేందర్ రెడ్డి"పాల్గోనడం విశేషం.యార్డులో జన్మదినం ముసుగులో న్యూసెన్స్ ఏంటి అని ప్రశ్నించాల్సిన సదరు కమీషన్ ఏజెంట్, ఆయన ఏడు పదులు దాటిన మేధావి,అలాగే అసోసియేషన్ కి అధ్యక్షుడు ఇన్ని అర్హతలు ఉన్న సోమ దేవేందర్ రెడ్డి కూడా పుట్టినరోజు వేడుకలో పాల్గొని,వారిని ప్రోత్సహించడం మార్కెట్ వర్గాలు తప్పుపడుతున్నారు.


**మార్కెట్ యార్డులో పిడిగుద్దుల వర్షం,ఇద్దరికీ గాయాలు,"2"రికీ "8" నుంచి నాలుగు కుట్లు పడినట్లు సమాచారం..**

బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో జన్మదినం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది.ఈ నేల "14"తారీఖున మార్కెట్ లో సదరు ఓ వ్యక్తి ది పుట్టినరోజున అతని సోదరుని తనయుడు ఆ వేడుకలో కొందరిపై గొడవకు దిగినట్లు విశ్వసనీయం సమాచారం.ఆ గొడవలో ఓ వ్యక్తికి బలంగా గాయం అవ్వడంతో కుట్లు పడ్డాయి. గాయపడ్డ వ్యక్తికి సంబంధించిన వాళ్ళ సుమారు యాభై మంది 16/7/26 న ఉదయం 11 నుంచి పన్నెండు గంటల సమయంలో బర్త్ డే బాయ్ అన్న కొడుకుని పై దాడులకు తెగబడ్డారు.ఈ క్రమంలో అతనికి ఎనిమిది కుట్లు పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత పెద్ద గొడవ చోటు చేసుకుంటే అధికారులు నిమ్మకు నిరెత్తనట్లు వ్యవహరించడం,వారి నిర్లక్ష్యానికి ఏమైనా జరగరానిది జరుగుతే ఎవరు బాధ్యులు అని మార్కెట్ వర్గాలు ప్రశ్నిస్తున్నారు.యార్డు అధికారుల పై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సమాచారం.? అసలు బోయిన్ పల్లి మార్కెట్ లో అన్ని సమస్యలే పట్టించుకునే నాథుడే లేడు.ఈ విష సంస్కృతి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మార్కెట్ మాయం అవ్వడం ఖాయం.

# విద్యార్థుల భవిష్యత్తు.. తాకట్టు కాదు

- ఫీజుల పేరుతో సర్టిఫికెట్లు ఆపడం చట్టవిరుద్ధం - తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు విద్యాసంస్థలకు గట్టి హెచ్చరిక





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** చదువుకున్న చదువుకు సాక్ష్యంగా నిలిచే సర్టిఫికెట్లు విద్యార్థి ఆస్తి అని, ఫీజుల బకాయిల పేరుతో వాటిని విద్యాసంస్థలు బందీ చేయకూడదని తెలంగాణ హైకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలు కావని, అవి సమాజ నిర్మాణ కేంద్రాలని గుర్తు చేస్తూ డబ్ల్యూపీ నెంబర్ 40238 ఆఫ్ 2025 కేసులో జస్టిస్ సురేపల్లి నందా వెలువరించిన తీర్పు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

**ఫీజుల కోసం కెరీర్‌ను బలిపెట్టొద్దు..**

సాధారణంగా అనేక ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులు చెల్లించలేదన్న నెపంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను (మార్క్స్ మెమోలు, ఇంటర్, డిగ్రీ పత్రాలు) తమ వద్దే ఉంచుకుంటున్నాయి. దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలు దొరకక మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ ధోరణిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఫీజులు వసూలు చేసుకోవడానికి విద్యా సంస్థలకు సివిల్ కోర్టుల ద్వారా చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయని పేర్కొంది.

**ఫీజుల కోసం కెరీర్‌ను బలిపెట్టొద్దు..**

సాధారణంగా అనేక ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులు చెల్లించలేదన్న నెపంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను (మార్క్స్ మెమోలు, డిగ్రీ పత్రాలు) తమ వద్దే ఉంచుకుంటున్నాయి. దీనివల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలు దొరకక మానసిక క్షోభకు గురవుతున్నారు. ఈ ధోరణిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఫీజులు వసూలు చేసుకోవడానికి విద్యాసంస్థలకు సివిల్ కోర్టుల ద్వారా చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయని, అంతేకానీ విద్యార్థి భవిష్యత్తుకు ద్వారాలైన సర్టిఫికెట్లను ఆపే హక్కు ఏ విద్యాసంస్థకూ లేదని కోర్టు స్పష్టం చేసింది.

**జీవన హక్కుపై దాడి చేసినట్లే..**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి వ్యక్తికీ గౌరవంగా జీవించే హక్కు ఉంది. విద్యార్థి సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల అతనికి లభించాల్సిన ఉద్యోగం లేదా పైచదువుల అవకాశం కోల్పోతే, అది నేరుగా అతని జీవన హక్కును కాలరాయడమేనని కోర్టు అభిప్రాయపడింది. "సర్టిఫికెట్లు విద్యాసంస్థల గిడ్డంగుల్లో బంధించబడే వస్తువులు కావు" అని కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం.

**యూనివర్సిటీల పర్యవేక్షణేది.?**

అనుబంధ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నప్పుడు యూనివర్సిటీలు ప్రేక్షక పాత్ర వహించకూడదని ధర్మాసనం పేర్కొంది. కళాశాలల ఆగడాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత యూనివర్సిటీలదేనని, లేనిపక్షంలో విద్యా వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుందని హెచ్చరించింది. పిటిషన్‌కు సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తక్షణమే విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పు విద్యార్థుల పాలిట ఒక రక్షణ కవచం వంటిది. ఫీజుల వేధింపులతో భవిష్యత్తును అంధకారం చేస్తున్న విద్యాసంస్థలకు ఇదొక గట్టి హెచ్చరిక. నిబంధనల పేరుతో విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలకు ఇకపై చరమగీతం పడనుంది.

# మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి. అంజిరెడ్డి

- కేంద్ర హోంమంత్రి ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ మెడల్ - 2022ను అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్
- హత్య కేసులను ఛేదించడంలో చాకచక్యం




**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా బి.అంజిరెడ్డి శుక్రవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ లోని తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. శేర్లింగంపల్లి ఎస్ఓటి సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న ఆయన బదిలీపై మేడ్చల్ కు వచ్చారు. మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బి. అంజిరెడ్డి కేంద్ర హోంమంత్రి ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ మెడల్ - 2022 ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు.

**హత్య కేసులను ఛేదించడంలో చాకచక్యం**

గతంలో బి.అంజిరెడ్డి మేడిపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో (2020) నమోదైన ఒడిశాకు చెందిన ఒక వలస కార్మికుడి హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే, అంజిరెడ్డి అత్యంత వినూత్నంగా, చాకచక్యంగా దర్యాప్తు చేపట్టి ఈ క్లిష్టమైన కేసును ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో ఆయన కనబరిచిన వృత్తిపరమైన నైపుణ్యం, విశేష కృషిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం కేంద్ర హోంమంత్రి ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్ మెడల్ - 2022 మెడల్‌ను ప్రకటించింది.

# తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం

- 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. వారికి పార్టీలు తరఫున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్‌ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు

- కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్ల దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి. గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588